తెలంగాణ TELANGANA MUCHATLU
# ముచ్చట్లు
TELTEL/2023/88710
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక
వరంగల్ | ఆదివారం - 26- జూలై 2026 | సంపుటి : 4 | సంచిక : 52 | పేజీలు - 8 | వెల : రూ 7 | www.telanganamuchatlu.in



# విజయం సాధించాం.. ఆందోళనలు విరమిస్తున్నాం

## డిమాండ్ల సాధనకు కేంద్రం అంగీకారం | సీజేపీ ప్రతినిధి ఆశుతోష్

**ఢిల్లీ,జూలై25(తెలంగాణ ముచ్చట్లు):**

నీట్ పేపర్ లీకేజీకి నిరసనగా విద్యార్థులతో కలిసి జంతర్ మంతర్ వద్ద 36 రోజులుగా కొనసాగుతున్న ఆందోళనలను విరమిస్తున్నట్లు కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) ప్రకటించింది. తమ ప్రధాన డిమాండ్లను కేంద్ర ప్రభుత్వం అంగీకరించడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు సీజేపీ ప్రతినిధి ఆశుతోష్ వెల్లడించారు.శనివారం కేంద్ర మంత్రులు జేపీ నడ్డా, జితేంద్ర సింగ్‌లతో సీజేపీ ప్రతినిధులు ఆశుతోష్, సౌరవ్ దాస్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థుల డిమాండ్లపై సుదీర్ఘంగా చర్చలు జరిగినట్లు ఇరుపక్షాలు వెల్లడించాయి.

**విద్యార్థులపై కేసులు ఎత్తివేస్తాం: కేంద్ర మంత్రి జేపీ నడ్డా**

సీజేపీ ప్రతినిధులతో జరిగిన సమావేశం అనంతరం కేంద్ర మంత్రి జేపీ నడ్డా మాట్లాడుతూ,

మిగతా 2లో

# ఇది విద్యార్థుల విజయం

## సీజేపీ వ్యవస్థాపకుడు అభిజీత్ ధీప్కే
## ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా..
## జంతర్ మంతర్ వద్ద విద్యార్థుల సంబరాలు

ఢిల్లీ, జూలై 25 (తెలంగాణ ముచ్చట్లు): నీట్ పేపర్ లీకేజీకి వ్యతిరేకంగా కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) ఆధ్వర్యంలో జంతర్ మంతర్ వద్ద కొనసాగుతున్న ఆందోళనల మధ్య కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తన పదవికి రాజీనామా చేశారు. దీంతో జంతర్ మంతర్ వద్ద ఉన్న విద్యార్థులు సంబరాలు నిర్వహించారు. "ఇది విద్యార్థుల విజయం" అంటూ సీజేపీ సామాజిక మాధ్యమాల వేదికగా హర్షం వ్యక్తం చేసింది.ఈ సందర్భంగా సీజేపీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే మాట్లాడుతూ, శాంతియుతంగా చేపట్టే ప్రతి ఉద్యమం చివరికి విజయాన్నే సాధిస్తుందని అన్నారు. మహాత్మా గాంధీ చూపిన మార్గంలోనే ఈ పోరాటాన్ని కొనసాగించామని, దేశ యువత చేపట్టిన శాంతియుత నిరసనలు

మిగతా 2లో



# కేంద్ర విద్యాశాఖ మంత్రిగా ప్రహ్లాద్ జోషికి అదనపు బాధ్యతలు

కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయడంతో ఆ శాఖ అదనపు బాధ్యతలను కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషికి అప్పగించారు. ప్రస్తుతం వినియోగదారుల వ్యవహారాలు, ఆహార, ప్రజా పంపిణీ శాఖ మంత్రిగా కొనసాగుతున్న ప్రహ్లాద్ జోషి ఇకపై విద్యాశాఖను కూడా అదనపు బాధ్యతగా నిర్వహించనున్నారు.ధర్మేంద్ర ప్రధాన్ సమర్పించిన రాజీనామా పత్రాన్ని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆమోదించారు. అనంతరం కేంద్ర ప్రభుత్వం విద్యాశాఖ నిర్వహణలో అంతరాయం కలగకుండా ప్రహ్లాద్ జోషికి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. కొత్త విద్యాశాఖ మంత్రిని నియమించే వరకు ఆయన ఈ బాధ్యతలను నిర్వర్తించనున్నారు.



# యువత ఆకాంక్షలను గౌరవిస్తున్నా.. అందుకే రాజీనామా

- ధర్మేంద్ర ప్రధాన్
- విద్యార్థులు న్యాయపరమైన చిక్కుల్లో పడకూడదనే నిర్ణయం తీసుకున్నా

**న్యూఢిల్లీ, జూలై 25 (తెలంగాణ ముచ్చట్లు):**

కేంద్ర విద్యాశాఖ మంత్రి పదవికి రాజీనామా చేసిన అనంతరం ధర్మేంద్ర ప్రధాన్ తన నిర్ణయానికి గల కారణాలను వెల్లడించారు. భారత ప్రజాస్వామ్య వ్యవస్థపై తనకు సంపూర్ణ విశ్వాసం ఉందని, దేశ యువత ఆకాంక్షలను, వారి కలలను గౌరవించే ఉద్దేశంతోనే రాజీనామా చేసినట్లు తెలిపారు.



దేశ భవిష్యత్తును నిర్మించే శక్తి యువతేనని పేర్కొన్న ఆయన, గత పది రోజులుగా చోటుచేసుకున్న పరిణామాలు తనను తీవ్రంగా కలచివేశాయని అన్నారు. ఆ పరిణామాల నేపథ్యంలో నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర మంత్రి పదవికి రాజీనామా చేసినట్లు వెల్లడించారు. తనకు కేంద్ర మంత్రివర్గంలో పనిచేసే అవకాశం కల్పించిన ప్రధాని నరేంద్ర మోదీకి కృతజ్ఞతలు తెలిపారు.

ధర్మేంద్ర ప్రధాన్ మాట్లాడుతూ, ఢిల్లీలోని జంతర్ మంతర్‌తో పాటు దేశవ్యాప్తంగా జరుగుతున్న ఆందోళనల్లో దేశ వ్యతిరేక శక్తులు చొరబడకుండా చూడడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని చెప్పారు. అదే సమయంలో విద్యార్థులు న్యాయపరమైన చిక్కుల్లో పడకుండా తమ చదువులు, భవిష్యత్ కెరీర్‌పై దృష్టిసారించాలని కోరారు. విద్యార్థుల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకునే తన రాజీనామా పత్రాన్ని ప్రధాని నరేంద్ర మోదీకి సమర్పించినట్లు పేర్కొన్నారు.

# సేవే నిజమైన రాజకీయం

- యువతకు హరీశ్‌రావు పిలుపు
- కేసీఆర్ నాయకత్వాన్ని ప్రశంసించిన నేత
- ప్రజాసేవే రాజకీయ లక్ష్యమన్న వ్యాఖ్య

**హైదరాబాద్, జూలై 25 (తెలంగాణ ముచ్చట్లు):**

రాజకీయం అంటే కేవలం ఎన్నికల్లో గెలవడం, అధికారం చేపట్టడం మాత్రమే కాదని, ప్రజల జీవితాల్లో సానుకూల మార్పు తీసుకురావడమే నిజమైన రాజకీయమని మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్‌రావు అన్నారు. 99టీవీ ఆధ్వర్యంలో నిర్వహించిన 'స్టేట్స్‌మ్యాన్ ఎక్సలెన్స్ అవార్డ్స్-కాంక్లేవ్'లో 'పాలిటిక్స్ బియాండ్ పవర్' అంశంపై మాట్లాడుతూ యువతను ఉద్దేశించి ఆయన స్ఫూర్తిదాయక ప్రసంగం చేశారు. నేటి యువత రాజకీయాన్ని ఎన్నికలు, సామాజిక మాధ్యమాలు, విమర్శలకే పరిమితం చేసి చూస్తోందని హరీశ్‌రావు అన్నారు. కానీ రైతుకు నీరు, విద్యార్థికి విద్య, యువతకు ఉపాధి, ప్రజలకు మెరుగైన వైద్యం, రహదారులు వంటి మౌలిక సదుపాయాలు అందించడమే అసలైన రాజకీయమని పేర్కొన్నారు. అధికారం అనేది ప్రజాసేవకు ఒక సాధనం మాత్రమేనని, సేవే అంతిమ లక్ష్యంగా ఉండాలని చెప్పారు.

తెలంగాణ ఉద్యమాన్ని ప్రస్తావిస్తూ, ఒక గొప్ప లక్ష్యానికి

మిగతా 2లో





# ఎల్-నీనోకు ముందస్తు ప్రణాళిక

- వంద రోజుల నీటి నిల్వలు
- జలసిరిపై ప్రత్యేక మంత్రి దృష్టి
- అప్రమత్తంగా ఉండాలన్న సీతక్క

**హైదరాబాద్, జూలై 25 (తెలంగాణ ముచ్చట్లు):**

దేశవ్యాప్తంగా ఎల్‌నీనో ప్రభావం కనిపిస్తున్న నేపథ్యంలో తెలంగాణలో తాగునీటి సరఫరాపై ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా మిషన్ భగీరథ అధికారులు అప్రమత్తంగా వ్యవహరించాలని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖల మంత్రి డాక్టర్ దనసరి అనసూయ సీతక్క ఆదేశించారు. శనివారం సచివాలయంలో మిషన్ భగీరథ తాగునీటి సరఫరాపై ఉన్నతస్థాయి సమీక్ష సమావేశం నిర్వహించి నీటి నిల్వలు, సరఫరా పరిస్థితులను సమీక్షించారు.

మిగతా 2లో

# జెన్‌జీకి చట్టసభల్లో అవకాశం కల్పించాలి

- ఎమ్మెల్యే, ఎంపీగా పోటీ వయస్సు 25 నుంచి 21 ఏళ్లకు తగ్గించాలి
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి
- ఆగస్టు తొలి వారంలో ప్రత్యేక అసెంబ్లీ సమావేశం..
- కేంద్రానికి తీర్మానం పంపనున్న తెలంగాణ ప్రభుత్వం

**హైదరాబాద్,జూలై25(తెలంగాణ ముచ్చట్లు):**

దేశ భవిష్యత్తును తీర్చిదిద్దే జెన్‌జీ యువతకు చట్టసభల్లో ప్రాతినిధ్యం కల్పించాల్సిన అవసరం ఉందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. శాసనసభ, లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేసే కనీస వయోపరిమితిని ప్రస్తుతం ఉన్న 25 ఏళ్ల నుంచి 21 ఏళ్లకు తగ్గించాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఇందుకు అవసరమైన రాజ్యాంగ, చట్ట సవరణలు చేపట్టాలని కోరారు.

ఆగస్టు తొలి వారంలో తెలంగాణ శాసనసభ, శాసన మండలిని ప్రత్యేకంగా సమావేశపరచి, చట్టసభలకు పోటీ చేసే కనీస వయోపరిమితిని తగ్గించాలని కోరుతూ తీర్మానం ఆమోదించి కేంద్ర ప్రభుత్వానికి పంపనున్నట్లు ప్రకటించారు.

మిగతా 2లో



తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక



# విజయం సాధించాం.. ఆందోళనలు విరమిస్తున్నాం

(మొదటి పేజీ తరువాయి)

ఢిల్లీతో పాటు దేశవ్యాప్తంగా నిరసనల్లో పాల్గొన్న విద్యార్థులపై నమోదైన కేసులను ఎత్తివేస్తామని తెలిపారు. భవిష్యత్తులో నిరసనలు వ్యక్తం చేసినందుకు విద్యార్థులను కేసులతో వేధించబోమని హామీ ఇచ్చారు. నీట్ పేపర్ లీకేజీ ఘటనతో ఆత్మహత్యలకు పాల్పడిన విద్యార్థుల కుటుంబాలకు ప్రభుత్వం అండగా నిలుస్తుందని చెప్పారు.

**మూడు ప్రధాన డిమాండ్లకు అంగీకారం**

సీజేపీ ప్రతినిధి ఆశుతోష్ మాట్లాడుతూ, కేంద్రం ముందు మూడు ప్రధాన డిమాండ్లను ఉంచినట్లు తెలిపారు. కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాతో తమ తొలి డిమాండ్ నెరవేరిందన్నారు. దేశవ్యాప్తంగా విద్యార్థులపై నమోదైన కేసులను ఎత్తివేయడంతో పాటు భవిష్యత్తులో ఎలాంటి చర్యలు తీసుకోకూడదని కోరినట్లు చెప్పారు. నీట్ పేపర్ లీకేజీ కారణంగా ఆత్మహత్యలు చేసుకున్న 21 మంది విద్యార్థుల కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.1 కోటి చొప్పున ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని కోరినట్లు వెల్లడించారు. ఈ డిమాండ్లన్నింటినీ అమలు చేసేందుకు కేంద్ర ప్రభుత్వం అంగీకరించిందని, మంగళవారం నాటికి లిఖితపూర్వక హామీ ఇవ్వనున్నట్లు తెలిపిందని వివరించారు.కేంద్ర ప్రభుత్వ విజ్ఞప్తి మేరకు జంతర్ మంతర్ వద్ద కొనసాగుతున్న ఆందోళనలను విరమిస్తున్నట్లు ప్రకటించిన ఆశుతోష్, దేశం నలుమూలల నుంచి వచ్చిన విద్యార్థులు సురక్షితంగా తమ ఇళ్లకు చేరుకోవాలని కోరారు.

# ఇది విద్యార్థుల విజయం

(మొదటి పేజీ తరువాయి)

ఫలించాయని పేర్కొన్నారు. విద్యార్థుల ఐక్యత, పోరాట స్ఫూర్తికి లభించిన విజయమే ఇది అని, ప్రజాస్వామ్యంలో ప్రజల గొంతుకకు విలువ ఉంటుందని చెప్పారు.

తమకు రాజకీయ ప్రయోజనాలు అవసరం లేదని, విద్యార్థుల ప్రయోజనాలే ముఖ్యమని అభిజీత్ దీప్కే స్పష్టం చేశారు. తమ ప్రధాన డిమాండ్లలో ఒకటి నెరవేరిందని, మిగిలిన రెండు డిమాండ్లు కూడా అమలయ్యే వరకు ఉద్యమాన్ని కొనసాగిస్తామని తెలిపారు. నిరసనల్లో పాల్గొన్న విద్యార్థులపై దాడి చేసిన పోలీసులపై చర్యలు తీసుకోవాలని, విద్యార్థులపై నమోదైన అన్ని కేసులను పూర్తిగా ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. అలాగే విద్యావ్యవస్థలో సమగ్ర సంస్కరణలు జరిగే వరకు ఉద్యమం ఆగదని స్పష్టం చేశారు. సాయంత్రం 6.30 గంటలకు జంతర్ మంతర్ నుంచి కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించి విద్యార్థుల ఐక్యతను చాటాలని సీజేపీ నాయకులు యువతకు పిలుపునిచ్చారు.



# ఎల్–నినోకు ముందస్తు ప్రణాళిక

(మొదటి పేజీ తరువాయి)

రాష్ట్రంలోని రిజర్వాయర్లలో నీటి నిల్వలను ప్రతిరోజూ సమీక్షిస్తూ అవసరమైన ప్రత్యామ్నాయ చర్యలను ముందుగానే సిద్ధం చేయాలని మంత్రి అధికారులకు సూచించారు. సింగూరు, పాలేరు వంటి కొన్ని రిజర్వాయర్లలో నీటి నిల్వలు తగ్గినప్పటికీ వచ్చే వంద రోజుల పాటు రాష్ట్రంలో తాగునీటి కొరత రాకుండా సమగ్ర కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేసినట్లు అధికారులు వివరించారు. ఆ ప్రణాళికను కచ్చితంగా అమలు చేసి ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చూడాలని మంత్రి ఆదేశించారు. రాష్ట్రవ్యాప్తంగా 23,455 ఆవాసాల్లో దాదాపు 90 శాతం గ్రామాలకు సాధారణ స్థాయిలో తాగునీటి సరఫరా కొనసాగుతుండటం సానుకూల పరిణామమని మంత్రి పేర్కొన్నారు. అలాగే 145 పట్టణ స్థానిక సంస్థల్లో 140 పట్టణాలకు పూర్తిస్థాయిలో తాగునీరు అందుతున్నట్లు తెలిపారు. మిగిలిన ప్రాంతాల్లో కూడా ఎలాంటి అంతరాయం లేకుండా తాగునీటి సరఫరా జరిగేలా అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు.

మండలాల వారీగా అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి పరిస్థితులను పరిశీలించాలని మంత్రి ఆదేశించారు. గ్రామాల్లో మహిళా సంఘాలు, సర్పంచులు, వార్డు సభ్యులు, పంచాయతీ కార్యదర్శులతో వాట్సాప్ గ్రూపులు ఏర్పాటు చేసి తాగునీటి సరఫరా సమయాలపై ముందస్తు సమాచారం అందించాలని సూచించారు. పైప్‌లైన్ మరమ్మతులు లేదా లీకేజీల కారణంగా నీటి సరఫరాకు అంతరాయం ఏర్పడితే ముందుగానే ప్రజలకు సమాచారం ఇవ్వాలని చెప్పారు. గ్రామాల్లో ఉన్న బోర్‌వెల్లను పూర్తిస్థాయిలో మరమ్మతులు చేసి సిద్ధంగా ఉంచాలని, బోర్‌వెల్ల వద్ద రీఛార్జ్ పిట్లు, వర్షపు నీటి సంరక్షణ పనులను వేగవంతం చేయాలని మంత్రి ఆదేశించారు. స్థానిక నీటి వనరులను బలోపేతం చేస్తూ జలసిరి కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలు చేయాలని, ప్రతి నీటి బొట్టును సంరక్షించేలా గ్రామ స్థాయిలో ప్రజల్లో అవగాహన కల్పించాలని సూచించారు. అవసరమైతే 16వ ఆర్థిక సంఘం నిధులను తాగునీటి అవసరాలకు వినియోగించాలని తెలిపారు. మిషన్ భగీరథకు ఇంకా అనుసంధానం కాని ఆదివాసీ, గిరిజన గ్రామాలను వారం రోజుల్లో సందర్శించి నివేదిక సమర్పించాలని, సమస్యాత్మక ప్రాంతాలకు ప్రత్యామ్నాయ కార్యాచరణ సిద్ధం చేయాలని మంత్రి ఆదేశించారు. ప్రతి 15 రోజులకు ఒకసారి తాగునీటి సరఫరాపై సమీక్ష నిర్వహిస్తానని, నిర్లక్ష్యం లేదా అలసత్వం ప్రదర్శించే అధికారులను ఉపేక్షించబోనని మంత్రి సీతక్క స్పష్టం చేశారు.




# జెన్‌జీకి చట్టసభల్లో అవకాశం కల్పించాలి

(మొదటి పేజీ తరువాయి)

నీట్ పరీక్షల్లో అవకతవకలు, ప్రశ్నపత్రాల లీకేజీలు, విద్యార్థుల ఆత్మహత్యలు, యువత చేపడుతున్న ఉద్యమాల నేపథ్యంలో "యువతే దేశం - దేశమే యువత" పేరుతో పీపుల్స్ ప్లాజా నుంచి ఇందిరాగాంధీ విగ్రహం వరకు నిర్వహించిన కొవ్వొత్తుల ర్యాలీలో ముఖ్యమంత్రి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కతో పాటు మంత్రులు, ప్రజాప్రతినిధులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ, 21 ఏళ్లకే ఐఏఎస్, ఐపీఎస్, ఐఎఫ్ఎస్ వంటి అత్యున్నత సేవల్లో యువత ప్రవేశిస్తుంటే, అదే వయస్సులో ఎమ్మెల్యే లేదా లోక్‌సభ సభ్యులుగా ఎందుకు పోటీ చేయకూడదని ప్రశ్నించారు. లోక్‌సభ, శాసనసభలకు పోటీ వయస్సును 21 ఏళ్లకు, రాజ్యసభకు ప్రస్తుతం అమలులో ఉన్న నిబంధనల ప్రకారం వయోపరిమితి సవరణపై కూడా కేంద్రం ఆలోచించాలని సూచించారు.

దేశంలో యువత గళం చట్టసభల్లో వినిపించాల్సిన అవసరం ఉందని, యువత అవసరాలను యువతే బాగా అర్థం చేసుకుని సమర్థవంతమైన నిర్ణయాలు తీసుకోగలరని అన్నారు. దేశ భవిష్యత్తు యువత చేతుల్లోనే ఉందని, వారికి నాయకత్వ అవకాశాలు కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందన్నారు.

మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ 61వ రాజ్యాంగ సవరణ ద్వారా ఓటు హక్కు వయస్సును 21 నుంచి 18 ఏళ్లకు తగ్గించిన విషయాన్ని గుర్తుచేసిన ముఖ్యమంత్రి, మాజీ ప్రధాని పీవీ నరసింహారావు హయాంలో స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసే కనీస వయోపరిమితిని 21 ఏళ్లకు తగ్గించినట్లు పేర్కొన్నారు.

జర్మనీ, బ్రిటన్ వంటి దేశాల్లో 18 ఏళ్లు నిండిన వారికి చట్టసభలకు పోటీ చేసే అవకాశం ఉందని, సింగపూర్‌లో 21 ఏళ్లు పూర్తి చేసుకున్న వ్యక్తి ప్రధానమంత్రి అయ్యే అవకాశం ఉన్నప్పుడు భారత్‌లో కూడా అలాంటి సంస్కరణలు అవసరమని అభిప్రాయపడ్డారు.

శాసనసభలో తీర్మానం చేసి కేంద్రానికి పంపడమే కాకుండా, పార్లమెంట్‌లో చట్ట సవరణ జరిగేలా అన్ని విధాలుగా ప్రయత్నిస్తామని హామీ ఇచ్చారు. ప్రస్తుతం దేశ జనాభాలో జెన్‌జీ యువత సుమారు 30 శాతం ఉన్నప్పటికీ, చట్టసభల్లో వారి ప్రాతినిధ్యం అత్యల్పంగా ఉండటం ఆందోళనకరమని పేర్కొన్నారు. యువత గళం చట్టసభల్లో వినిపించే రోజులు రావాలని, అందుకోసం తెలంగాణ ప్రభుత్వం తన వంతు కృషి చేస్తుందని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు.

# సేవే నిజమైన రాజకీయం

(మొదటి పేజీ తరువాయి)

బలమైన నాయకత్వం, యువత శక్తి కలిస్తే చరిత్ర సృష్టించవచ్చని అన్నారు. తెలంగాణ సాధన అసాధ్యమని భావించిన సమయంలో కేసీఆర్ తన నాయకత్వం, దీక్షతో ఉద్యమాన్ని విజయవంతం చేశారని పేర్కొన్నారు. విద్యార్థులు, యువత తమ వ్యక్తిగత భవిష్యత్తును పక్కనబెట్టి ఉద్యమంలో పాల్గొనడం వల్లే తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించిందని గుర్తు చేశారు. ప్రతిపక్షంలో ఉన్నప్పటికీ ప్రజల కోసం బాధ్యతాయుతంగా పనిచేయవచ్చని హరీశ్‌రావు అన్నారు. దేవాదుల ప్రాజెక్టు పంపులను ప్రారంభించేందుకు ప్రభుత్వం మీద ఒత్తిడి తీసుకువచ్చి రైతులకు సాగునీరు అందేలా చేశామని పేర్కొన్నారు. ప్రజల సమస్యల పరిష్కారమే ప్రజాస్వామ్యంలో ప్రతిపక్షం పాత్ర అని వ్యాఖ్యానించారు.



నేటి యువత సంకల్పిస్తే వ్యవస్థల్లో మార్పు తీసుకురాగలదని ఆయన అన్నారు. ప్రశ్నించే యువత ఉన్నప్పుడే ప్రజాస్వామ్యం బలపడుతుందని పేర్కొంటూ, ఇటీవల యువత ఉద్యమాల ప్రభావంతో కేంద్ర విద్యాశాఖ మంత్రి రాజీనామా చేయాల్సి వచ్చిన పరిణామాన్ని ఉదాహరణగా ప్రస్తావించారు. కృత్రిమ మేధస్సు సమాచారం అందించగలదే తప్ప, మానవత్వంతో కూడిన ఆలోచనలకు ప్రత్యామ్నాయం కాదని అన్నారు. ప్రజాప్రతినిధులు ప్రతి ప్రభుత్వ ఫైలు వెనుక ఒక కుటుంబం, ఒక మనిషి జీవితం ఉంటుందనే బాధ్యతతో వ్యవహరించాలని హరీశ్‌రావు సూచించారు. పదవులు శాశ్వతం కావని, ప్రజలకు చేసిన సేవ మాత్రమే చిరస్థాయిగా నిలుస్తుందని చెప్పారు. యువత ప్రేక్షకులుగా కాకుండా బాధ్యతగల పౌరులుగా దేశ నిర్మాణంలో భాగస్వాములు కావాలని, అధికారం కోసం కాదు ప్రజాసేవ కోసం నాయకత్వాన్ని చేపట్టాలని పిలుపునిచ్చారు.



తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్: బొల్లిపాక రాజేష్ · తెలుగు దిన పత్రిక
ఆదివారం - 26 - జూలై 2026


# బీరన్న బోనాల్లో భక్తి వెల్లివిరిసింది





- **గొల్ల కురుమలకు బీరన్న బోనాల శుభాకాంక్షలు తెలిపిన చైర్‌పర్సన్ సుహాసిని**

**హుజురాబాద్, జూలై 25(తెలంగాణ ముచ్చట్లు ):** హుజురాబాద్ పట్టణంలో గొల్ల కురుమల ఆధ్వర్యంలో నిర్వహించిన బీరన్న బోనాల మహోత్సవం భక్తిశ్రద్ధలు, సంప్రదాయాల నడుమ అత్యంత వైభవంగా జరిగింది. ఈ వేడుకల్లో మున్సిపల్ చైర్‌పర్సన్ శ్రీమతి రొంటాల సుహాసిని మనోజ్‌రావు ముఖ్య అతిథిగా పాల్గొని బీరన్న స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గొల్ల కురుమల సోదర సోదరీమణులను కలిసి బీరన్న బోనాల పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. భక్తులతో ఆప్యాయంగా మమేకమై వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు.

ఈ సందర్భంగా చైర్‌పర్సన్ సుహాసిని మనోజ్‌రావు మాట్లాడుతూ, తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బీరన్న బోనాల పండుగ గొల్ల కురుమల ఆత్మగౌరవానికి, ఐక్యతకు నిదర్శనమని అన్నారు. తరతరాలుగా వస్తున్న ఈ సంప్రదాయాలను భావి తరాలకు అందించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. గ్రామీణ సంస్కృతి, జానపద కళలు, సంప్రదాయ ఉత్సవాలు సమాజంలో ఐక్యతను పెంపొందించడంలో కీలక పాత్ర పోషిస్తాయని చెప్పారు. ప్రజలంతా సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని బీరన్న స్వామిని ప్రార్థించినట్లు తెలిపారు.

వేడుకల సందర్భంగా భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని బోనాలు సమర్పించారు. మహిళలు సంప్రదాయ వస్త్రధారణలో బోనాలతో ఊరేగింపుగా తరలివచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు. డప్పు వాయిద్యాలు, జానపద కళారూపాలు, భక్తి గీతాలతో ఆలయ పరిసరాలు ఆధ్యాత్మిక శోభను సంతరించుకున్నాయి. భక్తుల గోవింద నామస్మరణలతో బీరన్న ఆలయం మారుమోగింది.

ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ టౌన్ అధ్యక్షుడు మేకల తిరుపతి, కౌన్సిలర్ ఇల్లందుల సమ్మయ్య, కాంగ్రెస్ పార్టీ నాయకుడు రాజ్‌కుమార్, పార్టీ నాయకులు, గొల్ల కురుమ సంఘం ప్రతినిధులు, వార్డు ప్రజలు, మహిళలు, యువత, భక్తులు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు గొల్ల కురుమలకు పండుగ శుభాకాంక్షలు తెలియజేస్తూ, ఇలాంటి సంప్రదాయ ఉత్సవాలు సమాజంలో సోదరభావాన్ని పెంపొందిస్తాయని పేర్కొన్నారు. బీరన్న బోనాల వేడుకలు హుజురాబాద్ పట్టణంలో అత్యంత ఉత్సాహభరిత వాతావరణంలో కొనసాగగా, భక్తుల రాకపోకలతో ఆలయ పరిసరాలు కిక్కిరిసిపోయాయి. ప్రజలు భక్తిశ్రద్ధలతో బీరన్న స్వామిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. వేడుకలు శాంతియుతంగా, ఘనంగా నిర్వహించబడటంతో పాల్గొన్న భక్తులు నిర్వాహకులను అభినందించారు.

# ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా.. విద్యార్థుల పోరాట విజయమే: వొడితల ప్రణవ్

- **నీట్ లీకేజీపై కేంద్రం దిగివచ్చింది.. విద్యార్థుల పక్షాన కాంగ్రెస్ పోరాటం ఫలించింది**

**హుజురాబాద్,జులై 25(తెలంగాణ ముచ్చట్లు ):** నీట్ పరీక్ష ప్రశ్నపత్రం లీకేజీ వ్యవహారంలో కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలన్న విద్యార్థుల డిమాండ్‌కు కేంద్ర ప్రభుత్వం తలొగ్గిందని హుజురాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి వొడితల ప్రణవ్ పేర్కొన్నారు. విద్యార్థులు జంతర్‌మంతర్ వద్ద చేపట్టిన నిరసనలు దేశవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారాయని, వారి న్యాయమైన డిమాండ్లకు మద్దతుగా కాంగ్రెస్ పార్టీ, ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ బలంగా నిలిచారని ఆయన ఒక ప్రకటనలో తెలిపారు.

నీట్ పరీక్ష లీకేజీ ఘటన వెలుగులోకి వచ్చినప్పటి నుంచి విద్యార్థులు కేంద్ర విద్యాశాఖ మంత్రి రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ నిరసనలు కొనసాగించారని తెలిపారు. జంతర్‌మంతర్ వద్ద నిర్వహించిన ధర్నాకు దేశవ్యాప్తంగా విశేష స్పందన లభించిందని అన్నారు. విద్యార్థుల సమస్యలను పార్లమెంట్‌లోనూ, ప్రజా వేదికలపైనా రాహుల్ గాంధీ ప్రస్తావిస్తూ కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చారని పేర్కొన్నారు.

విద్యార్థుల డిమాండ్లను కేంద్ర ప్రభుత్వం చివరకు అంగీకరించి విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించడం విద్యార్థుల పోరాట విజయమని ప్రణవ్ అన్నారు. ఇది బీజేపీ ప్రభుత్వానికి చెంపపెట్టు లాంటిదని, ప్రజా ఉద్యమాల ముందు కేంద్రం తలవంచాల్సి వచ్చిందని విమర్శించారు.

గతంలో రైతుల ఉద్యమానికి కేంద్ర ప్రభుత్వం తలొగ్గి వ్యవసాయ చట్టాలను వెనక్కి తీసుకున్న విషయాన్ని గుర్తు చేస్తూ, ఇప్పుడు విద్యార్థుల పోరాటానికీ కేంద్రం స్పందించాల్సి వచ్చిందన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ విద్యార్థుల, యువత ప్రయోజనాల కోసం పోరాడుతుందని, భవిష్యత్తులో కూడా ప్రజా సమస్యలపై ప్రజలతో కలిసి మరిన్ని ఉద్యమాలు నిర్వహిస్తామని వొడితల ప్రణవ్ స్పష్టం చేశారు.



# సామాజిక న్యాయం కోసం బహుజన సేన పిలుపు

**ఎల్కతుర్తి, జూలై 25 (తెలంగాణ ముచ్చట్లు):** సామాజిక న్యాయం, రిజర్వేషన్ల పరిరక్షణే లక్ష్యంగా జూలై 26న హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించనున్న రిజర్వేషన్ డే సభను విజయవంతం చేయాలని బహుజన సేన పిలుపునిచ్చింది. ఈ మేరకు ఎల్కతుర్తి మండలంలోని సూరారం గ్రామ అంబేద్కర్ కూడలి వద్ద శనివారం కరపత్రాలను ఆవిష్కరించారు.



ఈ సందర్భంగా తెలంగాణ అంబేద్కర్ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చెప్యాల ప్రకాష్ మాట్లాడుతూ, ఛత్రపతి సాహుజి మహారాజ్ జయంతి సందర్భంగా నిర్వహిస్తున్న ఈ సభలో రిజర్వేషన్ల పరిరక్షణ, బీసీ, ఎస్సీ, ఎస్టీ, దళిత క్రైస్తవుల సమస్యలు, పూలే-సాహుజి-అంబేద్కర్ ఆశయాలపై విస్తృత చర్చ జరుగుతుందని తెలిపారు. విద్యార్థులు, మేధావులు, ఉద్యోగులు, నిరుద్యోగులు, కవులు, కళాకారులు, సామాజిక ఉద్యమకారులు అధిక సంఖ్యలో పాల్గొని సభను విజయవంతం చేయాలని కోరారు. రిజర్వేషన్లు వెనుకబడిన వర్గాల అభ్యున్నతికి కీలకమని పేర్కొన్న ఆయన, రాజ్యాంగం కల్పించిన హక్కులను పరిరక్షించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. బడుగు, బలహీన వర్గాలపై జరుగుతున్న దాడులు, మహిళలపై అఘాయిత్యాలను అరికట్టేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో గ్రామ అంబేద్కర్ సంఘం అధ్యక్షుడు మొలుగురి రమేష్, ఉపసర్పంచ్ మేకల బాబు, వార్డు సభ్యుడు మారుపాక రవీందర్, పొన్నాల వినోద్ కుమార్, మేకల కిషన్, మణుగూరు జేమ్స్, గడిపే ప్రశాంత్, మేకల శంకర్, మణుగూరు భాస్కర్, మేకల రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

# శివారాధనతో పుణ్యమయమైన తొలి ఏకాదశి

**ఎల్కతుర్తి, జూలై 25 (తెలంగాణ ముచ్చట్లు):** హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండలంలోని వల్లభాపురం గ్రామంలో వెలసిన శ్రీ పశుపతినాథ్ దేవస్థానంలో తొలి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని శనివారం భక్తిశ్రద్ధల నడుమ విశేష పూజా కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు సదానిరంజన్ సిద్ధాంతి ఆధ్వర్యంలో జరిగిన పూజల్లో గ్రామంతో పాటు పరిసర ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.



తెల్లవారుజాము నుంచే ఆలయం భక్తులతో కిటకిటలాడగా, వేదమంత్రోచ్ఛారణల నడుమ పంచామృత రుద్రాభిషేకం, బిల్వార్చన, సామూహిక అర్చనలు భక్తిపూర్వకంగా నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేసి స్వామివారి ఆశీర్వచనాలు అందించారు.

ఈ సందర్భంగా అర్చకులు సదానిరంజన్ సిద్ధాంతి మాట్లాడుతూ, తొలి ఏకాదశి రోజున పరమశివుని ఆరాధించడం వల్ల ఆయురారోగ్యాలు, ఐశ్వర్యం, సుఖశాంతులు కలుగుతాయని తెలిపారు. రాష్ట్రంలో సకాలంలో సమృద్ధిగా వర్షాలు కురిసి రైతులు సుభిక్షంగా ఉండాలని శ్రీ పశుపతినాథ స్వామివారిని ప్రత్యేకంగా ప్రార్థించినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ భావన ఋషి, కోడం రమేష్, దగ్గు వెంకటేశ్వరరావు, ఉడుత నరసన్న, ఆంధ్రప్రభ ప్రవీణ్, రాకేష్, మహేందర్, తరుణ్, ఠాగూర్, రంజాన్, శ్రీనివాస్, సుశాంత్, విజయ, మమత, సౌందర్య, పూజ, ఆద్విక, ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు, మహిళలు, యువకులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందారు.

## ఉపసర్పంచ్‌ల ఫోరం రాష్ట్ర కార్యదర్శిగా ముప్పూరి గణేష్ కుమార్



**వనపర్తి,జూలై25(తెలంగాణ ముచ్చట్లు-):**తెలంగాణ రాష్ట్ర ఉపసర్పంచ్‌ల ఫోరం రాష్ట్ర కమిటీలో వనపర్తి జిల్లాకు చెందిన ముప్పూరి గణేష్ కుమార్ రాష్ట్ర కార్యదర్శిగా నియమితులయ్యారు. ఈ సందర్భంగా జిల్లా వ్యాప్తంగా ఉన్న ఉపసర్పంచ్‌లు, ప్రజాప్రతినిధులు ఆయనకు శుభాకాంక్షలు తెలియజేస్తూ..నూతన బాధ్యతల్లో విజయవంతం కావాలని ఆకాంక్షించారు.ఈ సందర్భంగా రాష్ట్ర ఉపసర్పంచ్‌ల ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు బొట్ల కార్తీక్ మాట్లాడుతూ..గ్రామ పంచాయతీల అభివృద్ధిలో ఉపసర్పంచ్‌లు కీలక బాధ్యతలు నిర్వర్తిస్తున్నప్పటికీ, వారికి ప్రభుత్వం గౌరవ వేతనం కల్పించకపోవడం విచారకరమని అన్నారు.రాష్ట్రంలోని ఉపసర్పంచ్‌లకు నెలకు రూ.5,000/ వేల రూపాయల గౌరవ వేతనం మంజూరు చేయాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అదేవిధంగా గ్రామ పంచాయతీ వార్డు సభ్యులకు కూడా నెలకు రూ.3,000/ వేల రూపాయల గౌరవ వేతనం అందించాలని కోరారు. గ్రామీణ స్థానిక సంస్థలను బలోపేతం చేయాలంటే ప్రజాప్రతినిధుల సేవలకు తగిన గుర్తింపు, ఆర్థిక భరోసా కల్పించాల్సిన అవసరం ఉందని ఆయన పేర్కొన్నారు.రాష్ట్ర కార్యదర్శిగా నియమితులైన ముప్పూరి గణేష్ కుమార్ మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా ఉపసర్పంచ్‌ల సమస్యల పరిష్కారం, వారి హక్కుల పరిరక్షణ, సంక్షేమం కోసం అంకితభావంతో పనిచేస్తానని తెలిపారు. రాష్ట్రంలోని ప్రతి ఉపసర్పంచ్‌కు న్యాయం జరిగేలా ఫోరం తరపున నిరంతరం ప్రభుత్వ దృష్టికి సమస్యలను తీసుకెళ్తామని ఆయన అన్నారు.

## ఎల్‌నినో ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు ముందస్తు చర్యలు చేపట్టాలి



- **వనపర్తి జిల్లా అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్**

**వనపర్తి,జూలై25(తెలంగాణ ముచ్చట్లు):**ఎల్‌నినో ప్రభావం నేపథ్యంలో తాగునీటి నిర్వహణ, భూగర్భ జలాల సంరక్షణ, వర్షపు నీటి నిల్వ చర్యలపై ప్రత్యేక దృష్టి సారించి అన్ని శాఖలు సమన్వయంతో ముందస్తు కార్యాచరణ ప్రణాళికతో సన్నద్ధంగా ఉండాలని అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) ఖీమ్యా నాయక్ సూచించారు.శనివారం పెద్దమందడి మండలం వీరాయపల్లి గ్రామంలో నిర్వహించిన ఎల్‌నినో అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. గ్రామస్థాయిలో ప్రజలకు అవగాహన కల్పించడంతో పాటు తాగునీటి కొరత రాకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. భూగర్భ జలాలను సంరక్షిస్తూ వర్షపు నీటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. రైతులు వరి, చెరకు వంటి అధిక నీటి అవసరమున్న పంటలకు బదులుగా ఆరుతడి పంటలు, ఆయిల్ పామ్ వంటి ప్రత్యామ్నాయ పంటల సాగుపై దృష్టి పెట్టాలని, వ్యవసాయ శాఖ సూచనల మేరకు శాస్త్రీయ పద్ధతుల్లో సాగు చేపట్టాలని తెలిపారు.కార్యక్రమంలో ఉద్యాన శాఖ అధికారి విజయభాస్కర్, వ్యవసాయ శాస్త్రవేత్తలు, ఎంపీడీఓ, వ్యవసాయ, రెవెన్యూ శాఖ అధికారులు, గ్రామ సర్పంచ్, వార్డు సభ్యులు, రైతులు పాల్గొన్నారు.

## మద్దిగట్ల- మోజర్ల పాఠశాలలో విద్యార్థులకు చట్టాలపై పోలీసులు అవగాహన



**పెద్దమందడి,జూలై25(తెలంగాణ ముచ్చట్లు):** పెద్దమందడి మండలం మద్దిగట్ల మోజర్ల జిల్లా పరిషత్ పాఠశాలలో విద్యార్థులకు చట్టాలపై పోలీసులు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మైనర్ బాలురు వాహనాలు నడపడం, ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించడం, మద్యం సేవించి వాహనాలు నడపడం, గంజాయి తదితర మత్తు పదార్థాల వినియోగం వల్ల కలిగే దుష్పరిణామాలు, వాటికి సంబంధించిన చట్టపరమైన శిక్షలపై విద్యార్థులకు వివరించారు.ప్రధానోపాధ్యాయులు ఎస్. వరప్రసాద్ రావు మాట్లాడుతూ.. పాఠశాల పరిసరాల్లో అసాంఘిక కార్యకలాపాలను అరికట్టేందుకు పోలీసుల సహకారం కోరారు. పోలీసు అధికారులు విద్యార్థులు క్రమశిక్షణతో మెలగాలని, చట్టాలను గౌరవించాలని, మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు.ఈ కార్యక్రమంలో పోలీసు అధికారులు, ఉపాధ్యాయులు, పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

# ఎల్‌నినో ప్రభావం.. ప్రత్యామ్నాయ పంటల సాగుకు రైతులు సిద్ధం కావాలి



- **డా. జిలెల్ల చిన్నారెడ్డి**

**వనపర్తి,జూలై25(తెలంగాణ ముచ్చట్లు):** ఎల్‌నినో ప్రభావంతో ఈ ఏడాది వర్షపాతం తగ్గే అవకాశాలు ఉన్నందున రైతులు వరి సాగుకు బదులుగా తక్కువ నీటితో సాగయ్యే ప్రత్యామ్నాయ పంటలను ఎంచుకోవాలని రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షులు డా. జిలెల్ల చిన్నారెడ్డి సూచించారు.వనపర్తి జిల్లా గోపాల్పేట మండలం జయన్న తిరుమలాపూర్ గ్రామంలో నిర్వహించిన రైతు గ్రామసభలో ఆయన మాట్లాడుతూ, వాతావరణ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని నీటి లభ్యత, పెట్టుబడి, మార్కెట్ అవకాశాల ఆధారంగా పంటలను ఎంపిక చేసుకోవాలని అన్నారు. పంట మార్పిడి, భూసార పరీక్షలు, వర్షపు నీటి సంరక్షణ, సూక్ష్మ నీటిపారుదల పద్ధతులను అనుసరించడం ద్వారా సాగు వ్యయం తగ్గి మంచి దిగుబడి సాధించవచ్చని తెలిపారు. వరి స్థానంలో కందులు, పప్పుధాన్యాలు, కూరగాయలు, ఉద్యాన పంటల సాగుపై దృష్టి పెట్టాలని, వ్యవసాయ అధికారుల సలహాలతో శాస్త్రీయ పద్ధతుల్లో సాగు చేపట్టాలని రైతులకు సూచించారు.జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి మాట్లాడుతూ..జిల్లాలో కరవు పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని రైతులు ముందస్తుగా పంటల ప్రణాళిక రూపొందించుకోవాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి ఆంజనేయులు, అధికారులు, ప్రజాప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.

# ప్రకటనలకే పరిమితమైన డయాలసిస్ సెంటర్.. ప్రభుత్వంపై బీజేపీ విమర్శలు



**జమ్మికుంట టౌన్ జూలై 25 (తెలంగాణ ముచ్చట్లు):** జమ్మికుంట ప్రభుత్వ ఆసుపత్రికి ప్రభుత్వం డయాలసిస్ సెంటర్ మంజూరు చేసినట్లు ప్రకటించి నెలలు గడుస్తున్నా ఇప్పటికీ వైద్య పరికరాలు అందుబాటులోకి రాకపోవడంపై బీజేపీ పట్టణ శాఖ అధ్యక్షుడు కొలకాని రాజు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. శనివారం పార్టీ నాయకులతో కలిసి ప్రభుత్వ ఆసుపత్రిని సందర్శించిన ఆయన, ఆసుపత్రిలో అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. వైద్య సిబ్బందితో మాట్లాడి ఆసుపత్రి పరిస్థితులను తెలుసుకున్నారు.

ఈ సందర్భంగా కొలకాని రాజు మాట్లాడుతూ, జమ్మికుంట మండలంలో సుమారు 70 మంది డయాలసిస్ రోగులు చికిత్స కోసం కరీంనగర్, హనుమకొండ తదితర ప్రాంతాలకు వెళ్లాల్సిన పరిస్థితి నెలకొన్నదని అన్నారు. ప్రయాణ ఖర్చులు, సమయాభావం, శారీరక ఇబ్బందులతో రోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం డయాలసిస్ సెంటర్ మంజూరు చేసినట్లు ప్రకటించడం మాత్రమే కాకుండా, వెంటనే అవసరమైన వైద్య పరికరాలు ఏర్పాటు చేసి కేంద్రాన్ని ప్రారంభించాలని డిమాండ్ చేశారు. ప్రజల ప్రాణాలకు సంబంధించిన ఈ అంశంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడం తగదని, ఆలస్యం చేయకుండా డయాలసిస్ సేవలను అందుబాటులోకి తీసుకురావాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ పట్టణ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# సూరారంలో పేకాట స్థావరంపై పోలీసుల మెరుపు దాడి



- **17 మంది అరెస్ట్.. రూ.1.96 లక్షల నగదు, 4 కార్లు, బైక్, 19 సెల్‌ఫోన్లు స్వాధీనం**

**ఎల్కతుర్తి, జూలై 25 (తెలంగాణ ముచ్చట్లు):**హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండలంలోని సూరారం గ్రామ శివారులో రిలయన్స్ గ్యాస్ ప్లాంట్ సమీపంలో కొత్తగా నిర్మిస్తున్న ఫంక్షన్ హాల్‌లో పేకాట ఆడుతున్నారనే విశ్వసనీయ సమాచారం మేరకు పోలీసులు శనివారం రాత్రి మెరుపు దాడి నిర్వహించారు. రాత్రి సుమారు 8 గంటల సమయంలో సీఐ పులి రమేష్, ఎస్సై నరసింహారావు ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది ఫంక్షన్ హాల్‌పై ఆకస్మికంగా దాడి చేయగా, 17 మంది పేకాట ఆడుతూ పట్టుబడ్డారు. వారి వద్ద నుంచి రూ.1,96,030 నగదు, 4 కార్లు, ఒక బైక్, 19 సెల్‌ఫోన్లు, 208 పేకముక్కలు, స్కోర్ కార్డు స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన వారిలో హుజురాబాద్, హనుమకొండ, పెద్దపల్లి, నెక్కొండ, కొడకండ్ల, శాయంపేట, హుస్నాబాద్ తదితర ప్రాంతాలకు చెందిన వ్యక్తులు ఉన్నట్లు పోలీసులు తెలిపారు. పేకాట నిర్వహణకు స్థలాన్ని అందించిన ఫంక్షన్ హాల్ యజమాని శ్రీనివాస్పై కూడా కేసు నమోదు చేశారు.పట్టుబడిన 17 మందితో పాటు ఫంక్షన్ హాల్ యజమానిపై సంబంధిత చట్టాల కింద కేసులు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు. పోలీసుల మెరుపు దాడితో పేకాట స్థావరం భగ్నమై భారీ మొత్తంలో నగదు, వాహనాలు, ఇతర సామగ్రి స్వాధీనం కావడం స్థానికంగా చర్చనీయాంశమైంది. ఈ దాడిలో సీఐ పులి రమేష్, ఎస్సై నరసింహారావుతో పాటు పోలీసు సిబ్బంది పాల్గొని ఆపరేషన్‌ను విజయవంతంగా నిర్వహించారు.

# ఓటరు జాబితా సవరణ వేగవంతం చేయాలి

- **మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి**



**పెద్దమందడి,జూలై25(తెలంగాణ ముచ్చట్లు):** అర్హులైన ప్రతి ఒక్కరి ఓటు హక్కు పరిరక్షించాల్సిన బాధ్యత బీఆర్ఎస్ నాయకులు, బీఎల్ఏలపై ఉందని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి అన్నారు. శనివారం పెద్దమందడి మండలంలోని బుగ్గపల్లి తండా, అమ్మపల్లి, అమ్మపల్లి తండా గ్రామాల్లో కొనసాగుతున్న ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియను ఆయన పరిశీలించారు.ఈ సందర్భంగా బీఎల్‌వోలు, బీఎల్ఏలతో మాట్లాడిన ఆయన, సమయం తక్కువగా ఉన్నందున ఇంటింటికి వెళ్లి అర్హులైన ప్రతి ఒక్కరి ఓటు తుది జాబితాలో నమోదయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో బీఎల్‌వోల నుంచి సవరణ ప్రక్రియ పురోగతిని తెలుసుకున్నారు.కొన్ని బూత్‌లలో ఓటర్ల సంఖ్య అధికంగా ఉండటంతో బీఎల్‌వోలపై పనిభారం పెరిగిందని, అదనపు సిబ్బందిని ఏర్పాటు చేసి సకాలంలో ఓటరు జాబితా సవరణ పూర్తి చేయాలని సంబంధిత అధికారులను కోరారు.ఈ కార్యక్రమంలో జిల్లా రైతుబంధు మాజీ అధ్యక్షుడు జగదీశ్వర్ రెడ్డి, మాజీ జెడ్పీటీసీ రఘుపతి రెడ్డి, మనిగిల్ల సర్పంచ్ పలుస శ్రీనివాస్ గౌడ్, మాజీ సింగిల్ విండో ఉపాధ్యక్షుడు కుమార్ యాదవ్, చిన్న రఘు, సేనాపతి పురుషోత్తం రెడ్డి, రామేశ్వర్ రెడ్డి, గ్రామ పార్టీ అధ్యక్షుడు బందనా, చందు, బస్వరాజు, రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

# తొలి ఏకాదశికి శ్రీ వేంకటేశ్వరస్వామి సన్నిధిలో భక్తజన సందోహం



**జమ్మికుంట టౌన్ జూలై 25 (తెలంగాణ ముచ్చట్లు):** తొలి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని జమ్మికుంట శ్రీ వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో శనివారం భక్తుల రద్దీ నెలకొంది. తెల్లవారుజాము నుంచే పెద్ద సంఖ్యలో తరలివచ్చిన భక్తులు స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ ప్రాంగణం భక్తుల గోవింద నామస్మరణతో ఆధ్యాత్మిక వాతావరణాన్ని సంతరించుకుంది. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు సుప్రభాత సేవతో కార్యక్రమాలను ప్రారంభించి, ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు, దివ్య అలంకరణలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. ప్రత్యేకంగా అలంకరించిన స్వామివారి దివ్యమంగళ రూపాన్ని దర్శించుకున్న భక్తులు ఆధ్యాత్మిక పరవశానికి లోనయ్యారు. పట్టణంతో పాటు పరిసర గ్రామాల నుంచి భారీ సంఖ్యలో భక్తులు తరలివచ్చి క్యూలైన్లలో క్రమశిక్షణతో నిలబడి స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం ఆలయ అధికారులు ఏర్పాటు చేసిన తీర్థ ప్రసాదాలను స్వీకరించి స్వామివారి ఆశీస్సులు పొందారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ఆలయ నిర్వాహకులు తగిన ఏర్పాట్లు చేయడంతో దర్శనం ప్రశాంతంగా కొనసాగింది.

# నీట్ బాధితులకు కొవ్వొత్తుల నివాళి

- **హుజురాబాద్‌లో అఖిలపక్షం, ప్రజా సంఘాల కొవ్వొత్తుల ర్యాలీ**



**హుజురాబాద్,జులై 25(తెలంగాణ ముచ్చట్లు):** నీట్ పేపర్ లీకేజీ కారణంగా ఆత్మహత్యలకు పాల్పడిన విద్యార్థులకు నివాళిగా శనివారం హుజురాబాద్ పట్టణంలో ప్రజా సంఘాలు, అఖిలపక్ష నాయకుల ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. తహసీల్దార్ కార్యాలయం నుంచి అంబేద్కర్ చౌరస్తా వరకు కొవ్వొత్తులతో శాంతియుతంగా ర్యాలీ చేశారు

అనంతరం అంబేద్కర్ చౌరస్తా వద్ద జరిగిన కార్యక్రమంలో నాయకులు మాట్లాడుతూ, ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద విద్యార్థులు చేపట్టిన ఉద్యమానికి కేంద్ర ప్రభుత్వం దిగిరావడం ప్రజాస్వామ్య విజయమని అన్నారు. విద్యార్థి లోకం ఐక్యంగా పోరాడితే అసాధ్యం అనుకున్న లక్ష్యాలు కూడా సాధ్యమవుతాయని పేర్కొన్నారు.

భవిష్యత్తులో నీట్‌తో పాటు అన్ని పోటీ పరీక్షలను పారదర్శకంగా నిర్వహించాలని, పేపర్ లీకేజీలకు పూర్తిగా అడ్డుకట్ట వేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటం ఆడే నిర్లక్ష్యాన్ని సహించబోమని హెచ్చరించారు. జంతర్‌మంతర్ వద్ద కొనసాగుతున్న విద్యార్థుల నిరసనలు దేశ యువత శక్తిని చాటిచెప్పాయని, ఈ ఉద్యమం దేశవ్యాప్తంగా విద్యార్థుల్లో నూతన చైతన్యాన్ని తీసుకువచ్చిందని అన్నారు.

ఈ కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు, అఖిలపక్ష నాయకులు, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, విద్యార్థి సంఘాల నాయకులు, యువజన సంఘాల సభ్యులు, సామాజిక కార్యకర్తలు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# అపర భగీరథుడు తుమ్మలకు కృతజ్ఞతలు

- **మర్యాద పూర్వకంగా కలిసిన "డా.పులిపాటి నగర్ వెల్ఫేర్ అసోసియేషన్" సభ్యులు**



**ఖమ్మం బ్యూరో, జులై 25(తెలంగాణ ముచ్చట్లు ):** గోదావరి నది జలాలను ఖమ్మం జిల్లా నేలపైకి తీసుకొచ్చిన అపర భగీరథుడు తుమ్మల నాగేశ్వరరావుకు డాక్టర్ పులిపాటి నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. ఖమ్మంలో తుమ్మలను మర్యాదపూర్వకంగా కలిసిన అసోసియేషన్ సభ్యులు ఈ మేరకు ఆయనకు పుష్పగుచ్చాలు అందించి శాలువాలతో సత్కరించారు .ఈ సందర్భంగా పులిపాటి నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు డాక్టర్ పులిపాటి ప్రసాద్ మాట్లాడుతూ వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో ఖమ్మం జిల్లా వ్యవసాయ భూములు ఎండిపోతున్నందున సీతారామ ప్రాజెక్టు ద్వారా గోదావరి జలాలను ఖమ్మం జిల్లాలో పారించిన అపర భగీరథుడు తుమ్మల అని కొనియాడారు. జిల్లాలో సాగు, తాగు నీటి ఎద్దడి ఈ సందర్భంగా పులిపాటి వెల్ఫేర్ అసోసియేషన్ తరపున ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు వివరించారు అలాగే కలియుగ దైవం వెంకటేశ్వర స్వామి దేవాలయం నిర్మాణానికి పూనుకొని ఖమ్మం నగరం ప్రఖ్యాత నగరంగా మారడానికి కంకణం కట్టుకున్న ప్రజలు ఎప్పటికీ రుణపడి ఉంటారని తెలిపారు 47 కోట్ల వ్యయంతో నిర్మించనున్న హరిత భవనం కూడా జిల్లా జాతిని మరింత చేస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో పులిపాటి నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు పట్నాయక్ వెంకటేశ్వరరావు ప్రధాన కార్యదర్శులు మాధవరావు శ్రీనివాసరావు ట్రెజరర్ వరప్రసాదరావు నారాయణ పుల్లయ్య పవన్ అనిల్ తదితరులు పాల్గొన్నారు.

# బోరుకు చేయూత ఇచ్చిన కొండపల్లి

- **ఘనంగా కొండపల్లి శ్రీనివాస రావు పుట్టిన రోజు వేడుకలు**

**ఖమ్మం బ్యూరో, జులై 25(తెలంగాణ ముచ్చట్లు ):** కల్లూరు మండలం పరిధిలో ముగ్గు వెంకటాపురం గ్రామ పంచాయితీ లో పేరువంచ మాజీ ఎంపీటీసీ కొండపల్లి శ్రీనివాస రావు (వాసు) పుట్టిన రోజు సందర్భంగా శనివారం ముగ్గు వెంకటాపురంలో గ్రీన్ ఫీల్డ్ హైవే పక్కన గల ముత్యాలమ్మ తల్లి గుడి వద్ద అలాగే ఆర్ అండ్ బి రోడ్డు వద్ద గల రామాలయం లో బోర్లు వెయ్యడం జరిగింది.ఈ రెండు బోర్లు కలిపి సుమారుగా లక్ష ఇరవై వేల రూపాయిల వాసు సొంత ఖర్చుల తో హ్యాండ్ బోర్లు వేయించడం జరిగింది.

ఈ కార్యక్రమం లో ముగ్గు వెంకటాపురం సర్పంచ్ బేబీ స్వరాజ్యలక్ష్మి, సీనియర్ నాయకులు కొండపల్లి రాధాకృష్ణ,నానాజీ,నడికోప్పు నరసింహరావు,యంగల సురేష్,తాళ్ళూరి సుమన్, మెరుగు వీరబద్రరావు,మెరుగు నరసింహారావు,గుండపనేని నరేష్,పాశం ఉపెంద్ర, పాశం గోపి,గ్రామ పెద్దలు కొండపల్లి అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక





# పాత్రికేయుల సమస్యల పై రేపే "ఛలో పార్లమెంట్"

- **జంతర్ మంతర్ వద్ద ఒక రోజు ధర్నా**
- **ఢిల్లీకి బయలుదేరిన టీడబ్ల్యూజేఎఫ్ నేతలు, జర్నలిస్టులు**

**ఖమ్మం బ్యూరో,జూలై 25(తెలంగాణ ముచ్చట్లు):**కేంద్ర ప్రభుత్వం పరిష్కరించాల్సిన జర్నలిస్టుల సమస్యల పై రేపే తెలంగాణ జర్నలిస్టులు "ఛలో పార్లమెంట్" కార్యక్రమం చేపడుతున్నారు. ఇందులో భాగంగా ఈనెల 27న ఢిల్లీలోని పార్లమెంట్ (జంతర్ మంతర్) వద్ద ఒకరోజు ధర్నా చేయడానికి ఏర్పాట్లు జరిగాయి.తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్) ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ కార్యక్రమంలో పాల్గొనేందుకు రాష్ట్రవ్యాప్తంగా వివిధ జిల్లాల నుంచి జర్నలిస్టులు ఇప్పటికే ఢిల్లీకి బయలుదేరారు. హైదరాబాద్, మేడ్చల్ మల్కాజిగిరి, రంగారెడ్డి, వరంగల్, ఖమ్మం, కరీంనగర్, నిజామాబాద్, సూర్యాపేట, మహబూబ్ నగర్ జిల్లాల నుంచి టీడబ్ల్యూజేఎఫ్ నాయకులు శనివారం ఢిల్లీ బయలుదేరారు. పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు జరుతున్నందున దీర్ఘకాలంగా పెండింగ్ లో ఉన్న జర్నలిస్టుల సమస్యలను కేంద్ర ప్రభుత్వం దృష్టికి, పార్లమెంట్ సభ్యుల దృష్టికి తీసుకు వెళ్ళి సమస్యలను పరిష్కరించాలని కోరుతూ,తాము తొలిసారిగా "ఛలో పార్లమెంట్" కార్యక్రమం చేపడుతున్నట్లు తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య తెలిపారు.

ప్రభుత్వం పరిష్కరించాల్సిన సమస్యలు

జర్నలిస్టుల రైల్వే రాయితీ పాస్ ల పునరుద్ధరణ

దేశవ్యాప్తంగా జర్నలిస్టులకు రైలు ప్రయాణ చార్జీల్లో 50 శాతం రాయితీ కల్పిస్తూ దాదాపు పదిహేనేళ్ళు కొనసాగించిన రైల్వే రాయితీ సదుపాయాన్ని కేంద్ర ప్రభుత్వం కోవిడ్ సందర్భంగా నిలిపివేసింది. దీనిని పునరుద్ధరించకపోవడంతో దేశవ్యాప్తంగా జర్నలిస్టులు. ఇబ్బందులకు గురవుతున్నారు.జర్నలిస్టుల రైల్వే రాయితీ పాసులను పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తున్నారు.

జాతీయ మీడియా కమిషన్ ఏర్పాటుచేయాలి

దేశ వ్యాప్తంగా మీడియా రంగం విస్తరించిన నేపథ్యంలో వివిధ సమస్యలను పరిష్కరించేందుకు ప్రెస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా స్థానంలో నేషనల్ మీడియా కమీషన్ ఏర్పాటుచేయాలని కోరుతున్నారు.

నేషనల్ పెన్షన్ స్కీం ప్రవేశ పెట్టాలి

దేశవ్యాప్తంగా రిటైర్డ్, సీనియర్ జర్నలిస్టులు ఎటువంటి ఆదాయ వనరులు లేక ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కొన్ని రాష్ట్రాలలో రిటైర్డ్, సీనియర్ జర్నలిస్టులకు ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు పెన్షన్ స్కీం అమలు చేస్తున్నప్పటికి జాతీయ స్థాయిలో పెన్షన్ స్కీం లేక పోవడం వల్ల మిగతా రాష్ట్రాలలో ఈ స్కీం అమలుకావడంలేదు. అందుకే దేశవ్యాప్తంగా ఒకే పెన్షన్ విధానం ఉండేలా జాతీయ పెన్షన్ పథకం అమలు చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

జర్నలిస్టుల రక్షణ చట్టం చేయాలి

దేశంలోని అనేక రాష్ట్రాలలో జర్నలిస్టుల పై దాడులు, హత్యలు, అక్రమ కేసుల బనాయింపు వంటి సంఘటనలు పెరిగిపోతున్నాయి. వీటిని అరికట్టేందుకు పార్లమెంట్ లో జర్నలిస్టుల రక్షణ చట్టం తీసుకురావాలని డిమాండ్ చేస్తున్నారు.

ఎలక్ట్రానిక్, డిజిటల్ మీడియా కు చట్టబద్ధత కల్పించాలి,


ఎలక్ట్రానికి,డిజిటల్ మీడియాలకు పూర్తి స్థాయిలో చట్టబద్ధత లేకపోవడం వల్ల అనేక సమస్యలు, అనార్ధాలు ఎదురవుతున్నాయి. వెంటనే ఈ మీడియాలకు చట్టబద్దత కల్పించాలి.

ఇళ్ళస్థలాల పై సుప్రీం కోర్టు తీర్పును పునః సమీక్షించాలి

సంఘాలకు, జర్నలిస్ట్స్ హౌసింగ్ సొసైటీలకు ప్రభుత్వ భూముల కేటాయింపును నిరాకరిస్తూ సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పును సమీక్షించి, దేశవ్యాప్తంగా పాత్రికేయులకు ఇళ్ళ స్థలాలు కేటాయించేందుకు కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకో వాలని జర్నలిస్టులు విజ్ఞప్తి చేస్తున్నారు. ఈ డిమాండ్ల సాధనకై 27న జరిగే ఛలో పార్లమెంట్ కార్యక్రమంలో పాల్గొనేందుకు తెలంగాణ రాష్ట్రం నుంచి తరలివెళుతున్నారు. ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య, ప్, ప్రధాన కార్యదర్శి తన్నీరు శ్రీనివాస్ లతో పాటు అనేకమంది నాయకులు, సభ్యులు బయలుదేరి వెళ్ళారు.

# రహదారి భద్రతపై తెలంగాణ పోలీసుల అవగాహన ప్రచారం

- **ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని ప్రజలకు విజ్ఞప్తి**
- **సీటు బెల్ట్, వేగ నియంత్రణ, మొబైల్ వినియోగంపై హెచ్చరిక**
- **రోడ్డు భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని సందేశం**




**హైదరాబాద్, జూలై 25 (తెలంగాణ ముచ్చట్లు):** రహదారి ప్రమాదాల నివారణకు ప్రజల్లో అవగాహన పెంపొందించే లక్ష్యంతో తెలంగాణ పోలీసులు రోడ్డు భద్రతపై ప్రత్యేక ప్రచార కార్యక్రమాన్ని చేపట్టారు. "రహదారులపై భద్రత... మన బాధ్యత, మన జీవితం" అనే సందేశంతో రూపొందించిన అవగాహన పోస్టర్ ద్వారా ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని ప్రజలకు సూచించారు. రోడ్డు దాటే సమయంలో జీబ్రా క్రాసింగ్‌లను మాత్రమే వినియోగించాలని, వాహనదారులు తప్పనిసరిగా సీటు బెల్ట్ ధరించాలని పోస్టర్‌లో పేర్కొన్నారు. చిన్న జాగ్రత్తే ప్రాణాలను కాపాడగలదని, ట్రాఫిక్ నిబంధనల పట్ల ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని పోలీసులు సూచించారు. అధిక వేగం ప్రాణాంతక ప్రమాదాలకు దారితీస్తుందని హెచ్చరిస్తూ, నిర్ణయించిన వేగ పరిమితులను తప్పనిసరిగా పాటించాలని విజ్ఞప్తి చేశారు. వాహనం నడిపే సమయంలో మొబైల్ ఫోన్ వినియోగాన్ని పూర్తిగా నివారించాలని, డ్రైవింగ్‌పై పూర్తి దృష్టి కేంద్రీకరించాలని సూచించారు. రోడ్డు భద్రతలో పాదచారులు, వాహనదారులు ఇద్దరికీ సమాన బాధ్యత ఉందని పోలీసులు తెలిపారు. ట్రాఫిక్ సంకేతాలను గౌరవించడం, నిబంధనలను పాటించడం ద్వారా ప్రమాదాలను గణనీయంగా తగ్గించవచ్చని పేర్కొన్నారు. కుటుంబ సభ్యుల భద్రత కోసం ప్రతి ప్రయాణాన్ని జాగ్రత్తగా కొనసాగించాలని సూచించారు. "నిబంధనలు పాటించండి... క్షేమంగా ఇంటికి చేరుకోండి" అనే సందేశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్తూ, రహదారి భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని తెలంగాణ పోలీసులు మరోసారి గుర్తు చేశారు. సురక్షితమైన రహదారులు, సురక్షితమైన ప్రజలు, సురక్షితమైన దేశ నిర్మాణానికి ప్రతి పౌరుడు తన వంతు బాధ్యతను నిర్వర్తించాలని పిలుపునిచ్చారు. ట్రాఫిక్ నిబంధనలను కచ్చితంగా పాటించడం ద్వారా ప్రమాదాలను నివారించడమే కాకుండా ప్రాణాలను కాపాడుకోవచ్చని పోలీసులు పేర్కొన్నారు. చిన్నపాటి నిర్లక్ష్యం కూడా పెద్ద ప్రమాదాలకు కారణమవుతుందని హెచ్చరిస్తూ, రోడ్డు భద్రతను ప్రతి ఒక్కరూ తమ జీవన విధానంలో భాగం చేసుకోవాలని సూచించారు.

# ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా విద్యార్థుల విజయానికి తొలి మెట్టు

**ఎంపీ కడియం కావ్య**



**వరంగల్,జూలై 25 (తెలంగాణ ముచ్చట్లు):** కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా విద్యార్థుల ఉద్యమ విజయానికి తొలి మెట్టు అని వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య పేర్కొన్నారు. ఇది కేంద్ర ప్రభుత్వానికి దేశ యువత ఇచ్చిన గట్టి హెచ్చరికగా నిలిచిందని ఆమె అన్నారు.

శనివారం విడుదల చేసిన ప్రకటనలో ఆమె మాట్లాడుతూ, విద్యార్థుల భవిష్యత్తు, విద్యా వ్యవస్థ పరిరక్షణ కోసం 26 రోజులపాటు నిరంతరాయంగా సాగిన ఉద్యమం ఫలితంగానే ఈ పరిణామం చోటుచేసుకుందని తెలిపారు. రాజకీయాలకు అతీతంగా విద్యార్థులు తమ భవిష్యత్తుకు సంబంధించిన అంశాలపై సంఘటితంగా పోరాడడం ప్రజాస్వామ్య వ్యవస్థకు బలాన్ని చేకూరుస్తుందని పేర్కొన్నారు. ఉద్యమంలో పాల్గొన్న ప్రతి విద్యార్థికి, విద్యార్థి సంఘాలకు అభినందనలు తెలిపిన ఆమె, కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రజల అసలు సమస్యలను పక్కనపెట్టి మత రాజకీయాలతో ముందుకు సాగాలనే ప్రయత్నాలను యువత తిరస్కరిస్తోందని విమర్శించారు. ఈ ఉద్యమం ద్వారా విద్యార్థులు తమ ఐక్యత, శక్తి, సంకల్పాన్ని దేశానికి చాటిచెప్పారని అన్నారు.

ఇకపై కూడా ప్రజల సమస్యలను విస్మరిస్తూ అదే విధానాలతో పాలన కొనసాగించాలని కేంద్ర ప్రభుత్వం భావిస్తే, దేశ ప్రజలతో పాటు విద్యార్థులు, యువత కూడా సంఘటితంగా తగిన సమాధానం చెబుతారని హెచ్చరించారు. ఉద్యమాన్ని విజయవంతం చేసిన ప్రతి విద్యార్థికి, విద్యార్థి సంఘాలకు, ఉద్యమానికి మద్దతుగా నిలిచిన ప్రతి ఒక్కరికీ ఆమె ధన్యవాదాలు తెలిపారు.






# కడియం శ్రీహరిపై తాటికొండ రాజయ్య ఫైర్

**కడియంకు సవాల్ విసిరిన రాజయ్య**

**స్టేషన్ ఘనపూర్, జూలై 25 (తెలంగాణ ముచ్చట్లు):** ఎమ్మెల్యే కడియం శ్రీహరిపై మాజీ ఉప ముఖ్యమంత్రి తాటికొండ రాజయ్య తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. కడియం వారం రోజులుగా అసత్య ప్రచారం చేస్తూ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని ఆరోపించారు. గతంలో కాళేశ్వరం ప్రాజెక్టును ఇంజినీరింగ్ అద్భుతం, తెలంగాణకు వరప్రదాయిని అని కొనియాడిన కడియం, ఇప్పుడు అదే ప్రాజెక్టుపై భిన్నంగా మాట్లాడటం రాజకీయ అవకాశవాదమని విమర్శించారు. కాళేశ్వరం అంటే మేడిగడ్డ మాత్రమే కాదని, 16 రిజర్వాయర్లకు నీటిని అందించే సమగ్ర ఎత్తిపోతల వ్యవస్థ అని పేర్కొన్నారు. డ్యామ్ భద్రతను మాత్రమే ఎన్‌డీఎస్ఏ పరిశీలిస్తుందని, నీటి ఎత్తిపోతల బాధ్యత రాష్ట్ర ప్రభుత్వానిదేనని స్పష్టం చేసిందని గుర్తు చేశారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం కాళేశ్వరం ప్రాజెక్టుపై తప్పుడు ప్రచారం చేసి బీఆర్ఎస్ ప్రభుత్వానికి, కేసీఆర్‌కు చెడ్డపేరు తీసుకురావాలని ప్రయత్నిస్తోందని ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాల వల్లే తెలంగాణలో కరువు పరిస్థితులు నెలకొన్నాయని, స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గంలోనూ రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. దేవాదుల ప్రాజెక్టు ద్వారా రైతులకు నీరు అందించడంలో ప్రభుత్వం విఫలమైందని, రైతులకు వ్యతిరేకంగా కడియం మాట్లాడడం హాస్యాస్పదమని వ్యాఖ్యానించారు. కడియం శ్రీహరిపై అవినీతి ఆరోపణలు కూడా చేసిన రాజయ్య, కమిషన్ల కోసం అంచనా వ్యయాలను పెంచిన చరిత్ర ఆయనదేనని అన్నారు. మలేషియాలో ఆయన కుటుంబ సభ్యుల పేర్లపై ఉన్న ఆస్తులకు సంబంధించిన వివరాలు తన వద్ద ఉన్నాయని, అవసరమైతే నిరూపించేందుకు సిద్ధమని తెలిపారు. తాను చేసిన అభివృద్ధి పనులు, కడియం చేసిన పనులపై ప్రజల సమక్షంలో బహిరంగ చర్చకు సిద్ధమని ప్రకటించిన రాజయ్య, స్టేషన్ ఘనపూర్‌లోని అంబేద్కర్ విగ్రహం వద్దకు వచ్చి చర్చించాలని కడియం శ్రీహరికి సవాల్ విసిరారు. కాంగ్రెస్ పార్టీలో అసలు నాయకులకు పదవులు రాకుండా అడ్డుకుంటున్నారని కూడా ఆరోపించారు.





# విద్యార్థులు, యువత విజయమే ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా

**డాక్టర్ పిడమర్తి రవి**

**హిమాయత్‌నగర్‌లో మిఠాయిలు పంచి సంబరాలు**

**హైదరాబాద్,జూలై 25 (తెలంగాణ ముచ్చట్లు):** నీట్ పరీక్షల వ్యవహారంపై విద్యార్థులు, యువత చేపట్టిన ఉద్యమానికి కేంద్ర ప్రభుత్వం తలవంచిందని మాజీ ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ పిడమర్తి రవి అన్నారు. విద్యార్థుల ప్రధాన డిమాండ్ అయిన కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయడం విద్యార్థి, యువజన ఉద్యమ విజయానికి నిదర్శనమని పేర్కొన్నారు. హిమాయత్‌నగర్‌లో కార్పొరేటర్ మహాలక్ష్మి రామన్ గౌడ్ ఆధ్వర్యంలో విద్యార్థుల విజయానికి గుర్తుగా నిర్వహించిన మిఠాయిల పంపిణీ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మిఠాయిలు పంచుకుని కార్యకర్తలు ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పిడమర్తి రవి మాట్లాడుతూ, విద్యార్థులు, యువత ఇదే స్ఫూర్తితో ప్రజాస్వామ్యబద్ధంగా పోరాటాలు కొనసాగించాలని పిలుపునిచ్చారు. రానున్న ఎన్నికల్లో ప్రజాస్వామ్యవాద శక్తులన్నీ ఏకమై కేంద్ర ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెప్పాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ప్రజల సమస్యలపై జరిగే ప్రతి ప్రజాస్వామ్య ఉద్యమానికి కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో మాజీ టీపీసీసీ కార్యదర్శి వక్కలగడ్డ సోమచంద్రశేఖర్, రాష్ట్ర కార్యదర్శి చామకూర శ్రీధర్ గౌడ్, కాంగ్రెస్ నాయకులు ఎండి రహీం, బీఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు బోరెల్లి సురేష్, దేవరకొండ నరేష్, మహేష్, జోగు గణేష్ తదితరులు పాల్గొన్నారు.

# హైడ్రోజన్ రైలుతో భారత్ కొత్త చరిత్ర

- **1,200 కిలోమీట్ల విజయయాత్ర**
- **డీజిల్ వినియోగానికి భారీ ఆదా**
- **హరిత రవాణాలో భారత్ ముందంజ**



**న్యూఢిల్లీ, జూలై 25 (తెలంగాణ ముచ్చట్లు):** దేశంలోని తొలి హైడ్రోజన్ ఇంధన రైలును జూలై 17న హర్యానాలోని జింద్-సోనిపట్ మార్గంలో ప్రారంభించిన తర్వాత అది విజయవంతంగా 1,200 కిలోమీటర్లకు పైగా ప్రయాణించినట్లు కేంద్ర ప్రభుత్వం వెల్లడించింది. ఈ ప్రయాణం ద్వారా 3,200 లీటర్లకు పైగా డీజిల్ వినియోగాన్ని ఆదా చేసినట్లు తెలిపింది. భారతీయ రైల్వేలో హరిత సాంకేతికతకు ఇది కొత్త అధ్యాయమని పేర్కొంది. హైడ్రోజన్, ఆక్సిజన్ మధ్య జరిగే రసాయనిక చర్య ద్వారా ఈ రైలు విద్యుత్‌ను ఉత్పత్తి చేసుకుని నడుస్తుంది. ఈ ప్రక్రియలో నీటి ఆవిరి మాత్రమే వెలువడుతుండటంతో పొగ, కార్బన్ ఉద్గారాలు ఉండవని కేంద్ర ప్రభుత్వం వివరించింది. పర్యావరణ హిత రవాణా వ్యవస్థకు ఇది కీలక ముందడుగుగా అభివర్ణించింది. ఈ ప్రాజెక్టును పూర్తిగా భారతీయ రైల్వే స్వదేశీ సాంకేతికతతో అభివృద్ధి చేసింది. పది బోగీలతో కూడిన ఈ రైలులో రెండు హైడ్రోజన్ శక్తి యూనిట్లు, లిథియం ఇనుప ఫాస్ఫేట్ బ్యాటరీలు, హైడ్రోజన్ నిల్వ వ్యవస్థను ఏర్పాటు చేశారు. జింద్‌లో ప్రత్యేక హైడ్రోజన్ నిల్వ, ఇంధన నింపే కేంద్రాన్ని కూడా ఏర్పాటు చేశారు. రైలులో హైడ్రోజన్ లీకేజీ, వేడి, మంటలు, పొగను గుర్తించే బహుళ భద్రతా వ్యవస్థలను ఏర్పాటు చేసినట్లు అధికారులు తెలిపారు. అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా అన్ని భద్రతా పరీక్షలు పూర్తిచేసిన అనంతరమే ఈ రైలును ప్రయాణికుల సేవలకు అందుబాటులోకి తీసుకువచ్చినట్లు వెల్లడించారు. త్వరలో ఢిల్లీ మార్గంలో కూడా ప్రయోగాత్మక సేవలు ప్రారంభించనున్నట్లు పేర్కొన్నారు. హైడ్రోజన్ ఇంధన రైలు కేవలం సాంకేతిక విజయమే కాకుండా దేశంలో స్వదేశీ హైడ్రోజన్ రైల్వే వ్యవస్థ అభివృద్ధికి బలమైన పునాది వేసిందని కేంద్ర ప్రభుత్వం తెలిపింది. భవిష్యత్తులో సున్నా కాలుష్య ఉద్గారాలతో కూడిన రవాణా వ్యవస్థ విస్తరణకు ఇది దోహదపడుతుందని పేర్కొంది. భారతదేశాన్ని స్వచ్ఛమైన రవాణా రంగంలో ప్రపంచ అగ్రదేశాల సరసన నిలబెట్టే దిశగా ఈ ప్రాజెక్టు కీలక మైలురాయిగా నిలుస్తుందని కేంద్ర ప్రభుత్వం అభిప్రాయపడింది. హరిత ఇంధన వినియోగం, సుస్థిర అభివృద్ధి లక్ష్యాల సాధనలో భారతీయ రైల్వే మరో ముందడుగు వేసిందని వెల్లడించింది.

ఆదివారం - 26 - జూలై 2026

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక



# దక్షిణాదిలో కమర్షియల్ సినిమాల హవా: తమన్నా

సినీ పరిశ్రమలో రెండు దశాబ్దాల ప్రయాణాన్ని పూర్తి చేసుకున్న కథానాయిక తమన్నా భాటియా ఉత్తరాది, దక్షిణాది చిత్ర పరిశ్రమల మధ్య ఉన్న తేడాలపై ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. హిందీ చిత్రాల్లో నటనకు ప్రాధాన్యం ఉన్న వైవిధ్యమైన పాత్రలను ఎంచుకునే అవకాశం ఎక్కువగా ఉంటుందని ఆమె తెలిపారు.

దక్షిణాది చిత్రసీమలో మాత్రం కమర్షియల్ అంశాలు, స్టార్ ఇమేజ్‌కు అధిక ప్రాధాన్యం ఉంటుందని పేర్కొన్నారు. దీనిని పురుషాధిక్యతగా చూడకూడదని, అది అక్కడి వాణిజ్య సినిమా వ్యవస్థలో భాగమేనని స్పష్టం చేశారు. కమర్షియల్ సినిమాలు, కథా ప్రాధాన్యమున్న పాత్రల మధ్య సమతుల్యత పాటిస్తేనే దీర్ఘకాలం పరిశ్రమలో కొనసాగగలమని తమన్నా అభిప్రాయపడ్డారు.

ఇటీవల విడుదలైన హిందీ చిత్రం ‘స్త్రీ 2’ లోని ‘ఆజ్ కీ రాత్’ పాటకు యూట్యూబ్‌లో భారీ ఆదరణ లభించడంతో తమన్నాకు జాతీయ స్థాయిలో మరింత గుర్తింపు వచ్చింది. తాజాగా ఆమె చేసిన వ్యాఖ్యలు సినీ వర్గాలతో పాటు సామాజిక మాధ్యమాల్లో కూడా విస్తృత చర్చకు దారితీశాయి.



## తన పుట్టుక వెనుక సరదా కథ చెప్పిన అఖిల్

అక్కినేని అఖిల్ నటించిన ‘లెనిన్’ చిత్రం ఘనవిజయం సాధించిన నేపథ్యంలో ఆయన వరుస ఇంటర్వ్యూలతో బిజీగా ఉన్నారు. ఈ సందర్భంగా తన పుట్టుకకు సంబంధించిన ఓ సరదా సంఘటనను అభిమానులతో పంచుకుని అందరినీ నవ్వుల్లో ముంచెత్తారు.

అఖిల్ తెలిపిన వివరాల ప్రకారం, తాను తల్లి అమల గర్భంలో ఉన్న సమయంలో అమెరికాలో వైద్య పరీక్షలు నిర్వహించగా, వైద్యులు పొరపాటున కడుపులో ఉన్నది ఆడ శిశువేనని చెప్పారట. దీంతో కుటుంబ సభ్యులంతా ఎంతో ఆనందించారని, ముఖ్యంగా నాగార్జున కుమార్తె పుట్టబోతోందనే ఉత్సాహంలో మునిగిపోయారని తెలిపారు. అంతే కాకుండా పుట్టబోయే చిన్నారికి ‘నిఖిత’ అనే పేరు కూడా ముందుగానే నిర్ణయించినట్లు చెప్పారు. అయితే ప్రసవ సమయంలో వైద్యులు మగశిశువును చేతిలో పెట్టడంతో నాగార్జున ఒక్కసారిగా ఆశ్చర్యపోయారని అఖిల్ నవ్వుతూ గుర్తుచేశారు. ఆ సంఘటనను తనదైన హాస్య శైలిలో వివరిస్తూ, “ఆడపిల్ల వస్తుందని ఎదురుచూస్తుంటే... నేనే వచ్చేశాను” అంటూ సరదాగా చెప్పడంతో అక్కడున్న వారంతా నవ్వుల్లో మునిగిపోయారని తెలిపారు.

అఖిల్ చెప్పిన ఈ సరదా సంఘటనకు సంబంధించిన వీడియో ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. అభిమానులు పెద్దఎత్తున దాన్ని పంచుకుంటూ, నాగార్జున స్పందన ఎలా ఉండి ఉంటుందో ఊహిస్తూ వినోదభరిత వ్యాఖ్యలు చేస్తున్నారు. ఒకవైపు ‘లెనిన్’ విజయోత్సాహం, మరోవైపు అఖిల్ పంచుకున్న ఈ ఆసక్తికర జ్ఞాపకం అభిమానుల్లో చర్చనీయాంశంగా మారింది.

## పోయెస్ గార్డెన్‌లో నయనతారకు కొత్త ఇల్లు



దక్షిణాది అగ్ర కథానాయిక నయనతార చెన్నైలోని ప్రముఖుల నివాస ప్రాంతమైన పోయెస్ గార్డెన్‌లో విలాసవంతమైన కొత్త ఇంటిని కొనుగోలు చేసినట్లు సినీ వర్గాల్లో చర్చ సాగుతోంది. సుమారు రూ.40 కోట్ల విలువైన ఈ నివాసంలోకి త్వరలోనే ఆమె కుటుంబంతో కలిసి గృహప్రవేశం చేయనున్నట్లు సమాచారం.

పోయెస్ గార్డెన్‌లో ఇప్పటికే పలువురు సినీ, రాజకీయ ప్రముఖులు నివసిస్తుండగా, అదే ప్రాంతంలో నయనతార ఇల్లు కొనుగోలు చేయడం విశేషంగా మారింది. దీంతో ఆమె కొత్త నివాసం కోలీవుడ్‌లో హాట్ టాపిక్‌గా నిలిచింది. గత రెండు దశాబ్దాలుగా అగ్ర కథానాయికగా కొనసాగుతున్న నయనతార ప్రస్తుతం వరుస చిత్రాలతో బిజీగా ఉన్నారు. ఒకేసారి పలు చిత్రాల్లో నటిస్తూ దక్షిణాది సినీ పరిశ్రమలో అత్యధిక పారితోషికం అందుకుంటున్న నటీమణుల్లో ఒకరిగా కొనసాగుతున్నారు. ఒక్కో చిత్రానికి సుమారు రూ.15 కోట్ల వరకు పారితోషికం అందుకుంటున్నట్లు సినీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. నటనతో పాటు నిర్మాణ సంస్థ, ఇతర వ్యాపార రంగాల్లోనూ విజయవంతంగా ముందుకు సాగుతున్న నయనతార, ఈ కొత్త విలాసవంతమైన నివాసాన్ని సొంతం చేసుకోవడంతో మరోసారి వార్తల్లో నిలిచారు.



# వరదల్లో 170 మందికి రక్షణ

- **కోస్ట్‌గార్డ్ సాహసోపేత చర్యలు**
- **11 సహాయక చర్యల నిర్వహణ**
- **భారీ వర్షా ల్లో విజయవంతమైన రక్షణ**

**న్యూఢిల్లీ, జూలై 25 (తెలంగాణ ముచ్చట్లు):** దమన్, దాద్రా నగర్ హవేలీ, దక్షిణ గుజరాత్‌లో వరదల కారణంగా చిక్కుకుపోయిన 170 మందిని భారత కోస్ట్‌గార్డ్ సురక్షితంగా రక్షించింది. జూలై 22 అర్ధరాత్రి నుంచి ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలు, తీవ్ర వరదలు, ప్రతికూల వాతావరణ పరిస్థితుల మధ్య మొత్తం 11 సహాయక చర్యలు చేపట్టి బాధితులను సురక్షిత ప్రాంతాలకు తరలించినట్లు కేంద్ర ప్రభుత్వం వెల్లడించింది. భారీ వర్షాల కారణంగా పలు ప్రాంతాలు పూర్తిగా జలమయమవడంతో ప్రజలు ఇళ్లలో, ఇతర ప్రాంతాల్లో చిక్కుకుపోయారని అధికారులు తెలిపారు. క్లిష్ట పరిస్థితుల్లోనూ కోస్ట్‌గార్డ్ బృందాలు సమన్వయంతో పనిచేసి రక్షణ చర్యలను వేగవంతం చేశాయి. రక్షణ చర్యల్లో ప్రత్యేక పడవలు, ఆధునిక పరికరాలు, శిక్షణ పొందిన సిబ్బందిని వినియోగించినట్లు అధికారులు తెలిపారు. ప్రతికూల వాతావరణాన్ని లెక్కచేయకుండా బాధితులను గుర్తించి సురక్షిత ప్రాంతాలకు తరలించడం ద్వారా కోస్ట్‌గార్డ్ తన సేవా నిబద్ధతను మరోసారి చాటుకుందని పేర్కొన్నారు.

వరద ప్రభావిత ప్రాంతాల్లో పరిస్థితిని నిరంతరం పర్యవేక్షిస్తూ అవసరమైతే మరిన్ని సహాయక చర్యలు చేపట్టేందుకు కోస్ట్‌గార్డ్ సిద్ధంగా ఉందని కేంద్ర ప్రభుత్వం తెలిపింది. స్థానిక యంత్రాంగంతో సమన్వయం కొనసాగిస్తూ ప్రజల భద్రతకు ప్రాధాన్యం ఇస్తున్నట్లు వెల్లడించింది. విపత్తు సమయంలో ప్రజల ప్రాణాలను కాపాడేందుకు కోస్ట్‌గార్డ్ సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా పనిచేస్తున్నారని అధికారులు తెలిపారు. అత్యవసర పరిస్థితుల్లో వేగంగా స్పందించడం వల్లే పెద్ద ప్రమాదం తప్పిందని పేర్కొన్నారు. ప్రజలు వాతావరణ శాఖ, స్థానిక అధికారుల సూచనలను తప్పనిసరిగా పాటించాలని కేంద్ర ప్రభుత్వం విజ్ఞప్తి చేసింది. వరద ప్రభావిత ప్రాంతాల్లో అనవసరంగా బయటకు రావద్దని, అత్యవసర పరిస్థితుల్లో అధికారులను సంప్రదించాలని సూచించింది.



# మళ్లీ పెరిగిన బంగారం ధరలు..

**హైదరాబాద్, జులై 25 (తెలంగాణ ముచ్చట్లు):** శుక్రవారం స్వల్పంగా తగ్గిన బంగారం ధరలు శనివారం మళ్లీ పెరిగాయి. గుడ్ రిటర్న్స్ వెల్లడించిన వివరాల ప్రకారం, ఉదయం 10 గంటల నాటికి హైదరాబాద్, విజయవాడలో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,44,930కు చేరుకుంది. గత రోజుతో పోలిస్తే పది గ్రాములకు రూ.600 పెరిగింది. అదే విధంగా 22 క్యారెట్ల 10 గ్రాముల ఆభరణాల బంగారం ధర రూ.1,32,850గా నమోదైంది. ఇది శుక్రవారం ధరతో పోలిస్తే రూ.550 అధికం. 18 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,08,700గా కొనసాగుతోంది.

మరోవైపు వెండి ధరలు కూడా భారీగా పెరిగాయి. కిలో వెండి ధర ఒక్కరోజులోనే రూ.5 వేల మేర పెరిగి హైదరాబాద్, విజయవాడ మార్కెట్లలో రూ.2,40,000కు చేరుకుంది.

తెలంగాణలో హైదరాబాద్, నిజామాబాద్, ఖమ్మం, వరంగల్ నగరాల్లో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,44,930గా ఉండగా, 22 క్యారెట్ల ధర రూ.1,32,850, 18 క్యారెట్ల ధర రూ.1,08,700గా నమోదైంది.

ఆంధ్రప్రదేశ్‌లో విజయవాడ, విశాఖపట్నం, గుంటూరు, నెల్లూరు, తిరుపతి నగరాల్లో కూడా ఇదే ధరలు కొనసాగుతున్నాయి. 24 క్యారెట్ల బంగారం రూ.1,44,930, 22 క్యారెట్ల బంగారం రూ.1,32,850, 18 క్యారెట్ల బంగారం రూ.1,08,700గా ఉంది.

దేశంలోని ప్రధాన నగరాల్లో చెన్నైలో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,45,090గా నమోదైంది. ఢిల్లీలో రూ.1,45,080, అహ్మదాబాద్‌లో రూ.1,44,980గా ఉంది. ముంబై, కోల్‌కతా, కేరళలో మాత్రం 24 క్యారెట్ల బంగారం ధర రూ.1,44,930గా కొనసాగుతోంది.

22 క్యారెట్ల బంగారం ధర చెన్నై, ఢిల్లీలో రూ.1,33,000గా ఉండగా, అహ్మదాబాద్‌లో రూ.1,32,900, ముంబై, కోల్‌కతా, కేరళలో రూ.1,32,850గా నమోదైంది.

# ప్రేమకు ప్రతిరూపం.. జీవితానికి తొలి గురువులు

**డెస్క్, జూలై 25 (తెలంగాణ ముచ్చట్లు):** ప్రతి మనిషి జీవితంలో అత్యంత విలువైన బంధం తల్లిదండ్రులతోనిదే. మనకు జన్మనివ్వడం నుంచి జీవితంలో నిలదొక్కుకునే వరకు ప్రతి అడుగులోనూ తోడుగా నిలిచే వారు తల్లిదండ్రులు. వారి ప్రేమ, త్యాగం, అప్యాయత, సేవలను గుర్తు చేసుకునేందుకు ప్రతి ఏడాది జూలై నాలుగో ఆదివారం తల్లిదండ్రుల దినోత్సవాన్ని నిర్వహిస్తారు. ఈ ఏడాది ఈ దినోత్సవం జూలై 26న జరుపుకుంటున్నారు. కుటుంబ బంధాల గొప్పతనాన్ని చాటిచెప్పే ఈ రోజు తల్లిదండ్రుల పట్ల కృతజ్ఞతను వ్యక్తం చేసేందుకు ప్రత్యేక సందర్భంగా నిలుస్తోంది. ఒక బిడ్డ జన్మించిన నాటి నుంచి అతని భవిష్యత్తు కోసం కలలు కనే వారు తల్లిదండ్రులు. తమ సౌకర్యాలను త్యాగం చేసి పిల్లల చదువు, ఆరోగ్యం, భవిష్యత్తు కోసం నిరంతరం శ్రమిస్తారు. ఎన్నో కష్టాలు, ఇబ్బందులు ఎదురైనా వాటిని పిల్లలకు తెలియనీయకుండా వారి జీవితాన్ని సంతోషంగా తీర్చిదిద్దేందుకు అహర్నిశలు కృషి చేస్తారు. తల్లిదండ్రుల ప్రేమకు, త్యాగానికి ఎలాంటి ప్రతిఫలం ఇవ్వలేమని ప్రతి ఒక్కరూ అంగీకరిస్తారు.



పిల్లలు జీవితంలో నేర్చుకునే తొలి పాఠాలు ఇంటి నుంచే ప్రారంభమవుతాయి. మాట్లాడడం, నడవడం, మంచి చెడు తెలుసుకోవడం, పెద్దలను గౌరవించడం, ఇతరులతో ఎలా ప్రవర్తించాలో నేర్పేది తల్లిదండ్రులే. నిజాయితీ, క్రమశిక్షణ, మానవత్వం, సహనం, బాధ్యత వంటి విలువలను వారు చిన్ననాటి నుంచే అలవాటు చేస్తారు. అందుకే తల్లిదండ్రులను జీవితానికి తొలి గురువులుగా పేర్కొంటారు. నేటి వేగవంతమైన జీవనశైలిలో కుటుంబ సభ్యుల మధ్య గడిపే సమయం తగ్గుతోంది. ఉద్యోగాలు, చదువులు, విదేశీ ఉపాధి, వలసల కారణంగా చాలామంది పిల్లలు తల్లిదండ్రులకు దూరంగా జీవిస్తున్నారు. దీంతో వృద్ధాప్యంలో అనేక మంది తల్లిదండ్రులు ఒంటరితనాన్ని ఎదుర్కొంటున్నారు. సాంకేతిక పరిజ్ఞానం ఎంత పెరిగినా, కుటుంబ సభ్యుల మధ్య ఆత్మీయతను అది భర్తీ చేయలేదని సామాజిక నిపుణులు చెబుతున్నారు. వృద్ధాప్యంలో తల్లిదండ్రులకు అవసరమయ్యేది పెద్దగా సంపద కాదు. ప్రేమగా పలకరించడం, వారి ఆరోగ్యాన్ని పట్టించుకోవడం, కొంత సమయం కేటాయించడం, వారి మాటలు వినడం వంటి చిన్న చిన్న విషయాలే వారికి అపారమైన ఆనందాన్ని ఇస్తాయి. పిల్లల విజయాలను చూసి సంతోషపడే తల్లిదండ్రులకు, వారి ప్రేమకు ప్రతిఫలంగా గౌరవం ఇవ్వడం ప్రతి సంతానం బాధ్యతగా భావించాలి. భారతీయ సంస్కృతిలో తల్లిదండ్రులకు అత్యున్నత స్థానం కల్పించారు. తల్లి, తండ్రిని దైవంతో సమానంగా భావిస్తూ వారి సేవను గొప్ప ధర్మంగా పేర్కొన్నారు. పూర్వకాలం నుంచి కుటుంబ వ్యవస్థ మన సంస్కృతికి బలమైన పునాదిగా నిలిచింది. ఆ విలువలను భావితరాలకు అందించడం ప్రతి కుటుంబం బాధ్యతగా మారింది.

తల్లిదండ్రుల దినోత్సవం సందర్భంగా దేశవ్యాప్తంగా పాఠశాలలు, కళాశాలలు, వివిధ సంస్థలు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నాయి. విద్యార్థులు తమ తల్లిదండ్రులకు శుభాకాంక్షలు తెలియజేస్తూ కృతజ్ఞతా సందేశాలు అందిస్తున్నారు. కుటుంబ బంధాల ప్రాధాన్యంపై అవగాహన కార్యక్రమాలు, సాంస్కృతిక ప్రదర్శనలు, సన్మాన కార్యక్రమాలు కూడా నిర్వహిస్తున్నారు. సామాజిక మాధ్యమాల ప్రభావంతో శుభాకాంక్షలు తెలియజేయడం సులభమైనప్పటికీ, తల్లిదండ్రులతో ప్రత్యక్షంగా కొంత సమయం గడపడం, వారి కష్టాలను అర్థం చేసుకోవడం, వారి అవసరాలను తీర్చడం మరింత విలువైనది. మాటల్లో మాత్రమే కాకుండా చేతల్లో ప్రేమను చూపినప్పుడే ఈ దినోత్సవం నిజమైన అర్థాన్ని సంతరించుకుంటుంది. బలమైన కుటుంబ వ్యవస్థే బలమైన సమాజానికి పునాది. కుటుంబంలో పరస్పర ప్రేమ, గౌరవం, బాధ్యతాభావం ఉంటే సమాజం కూడా అభివృద్ధి దిశగా పయనిస్తుంది. మంచి పౌరులను తీర్చిదిద్దడంలో తల్లిదండ్రుల పాత్ర అపారమైనది. వారి మార్గదర్శకత్వంతోనే ఎన్నో మంది ఉన్నత స్థానాలకు చేరుకుని దేశానికి సేవలందిస్తున్నారు. తల్లిదండ్రుల దినోత్సవం ఒక్కరోజు జరుపుకునే వేడుక మాత్రమే కాదు. జీవితాంతం తల్లిదండ్రుల పట్ల ప్రేమ, గౌరవం, కృతజ్ఞతను చూపాలని గుర్తు చేసే విలువైన సందర్భం. వారి త్యాగాలను ఎప్పటికీ మరవకుండా, వృద్ధాప్యంలో వారికి అండగా నిలవడం ప్రతి ఒక్కరి నైతిక బాధ్యత. తల్లిదండ్రుల చిరునవ్వే ప్రతి కుటుంబానికి నిజమైన సంపద అనే విషయాన్ని ఈ దినోత్సవం మరోసారి గుర్తు చేస్తోంది.

# కార్గిల్ విజయం.. త్యాగం, ధైర్యం, దేశభక్తికి చిరస్మరణీయ గాథ

**డెస్క్, జూలై 25 (తెలంగాణ ముచ్చట్లు):** కార్గిల్ విజయ్ దివస్ భారత చరిత్రలో కేవలం ఒక విజయదినం మాత్రమే కాదు.. దేశ సమగ్రత, సార్వభౌమాధికారాన్ని కాపాడేందుకు భారత సైనికులు ప్రదర్శించిన అసాధారణ ధైర్యసాహసాలకు ప్రతీక. 1999లో కార్గిల్ కొండల్లో జరిగిన యుద్ధంలో భారత సైన్యం ప్రపంచానికి తన శక్తి, వ్యూహం, త్యాగనిరతిని చాటిచెప్పింది. శత్రువులు చొరబడి ఆక్రమించిన ఎత్తైన పర్వత శిఖరాలను తిరిగి స్వాధీనం చేసుకోవడం సాధారణ విషయం కాదు. ప్రాణాలను సైతం లెక్కచేయకుండా దేశం కోసం పోరాడిన వీర జవాన్ల త్యాగం భారత చరిత్రలో శాశ్వతంగా నిలిచిపోయింది. కార్గిల్ యుద్ధం భారత సైన్యం ఎదుర్కొన్న అత్యంత క్లిష్టమైన సవాళ్లలో ఒకటి. మంచుతో కప్పుకున్న ఎత్తైన పర్వత ప్రాంతాల్లో ఆక్సిజన్ కొరత, తీవ్ర చలి, శత్రువుల ఎత్తైన స్థానాలు వంటి ఎన్నో ప్రతికూల పరిస్థితుల మధ్య భారత సైనికులు అద్భుతమైన సాహసాన్ని ప్రదర్శించారు. ప్రతి అడుగు ప్రమాదకరమైనప్పటికీ వెనక్కి తగ్గకుండా ముందుకు సాగి విజయాన్ని అందుకున్నారు. దేశ రక్షణ విషయంలో భారత సైన్యం ఎంత అంకితభావంతో పనిచేస్తుందో ఈ యుద్ధం ప్రపంచానికి తెలియజేసింది.




యుద్ధంలో విజయం సాధించడం వెనుక ఎన్నో కుటుంబాల కన్నీళ్లు, తల్లిదండ్రుల త్యాగం, భార్యాభర్తల విడిపోవడం, చిన్నారుల కోల్పోయిన ఆప్యాయత దాగి ఉంది. దేశం కోసం ప్రాణాలు అర్పించిన ప్రతి జవాన్ వెనుక ఒక కుటుంబం ఉంటుంది. వారి త్యాగాన్ని మాటల్లో వర్ణించడం సాధ్యం కాదు. అందుకే కార్గిల్ విజయ్ దివస్ రోజున విజయాన్ని మాత్రమే కాదు, అమరులైన వీర జవాన్లను కూడా దేశం కృతజ్ఞతతో స్మరించుకుంటుంది. భారత యువతకు కార్గిల్ యుద్ధం ఒక గొప్ప స్ఫూర్తి. దేశభక్తి అంటే కేవలం నినాదాలు చేయడం కాదని, అవసరమైతే దేశం కోసం త్యాగం చేయడానికి సిద్ధంగా ఉండే మనస్తత్వమని ఈ యుద్ధం తెలియజేసింది. క్రమశిక్షణ, ధైర్యం, బాధ్యత, ఐక్యత వంటి విలువలను యువతలో పెంపొందించేందుకు కార్గిల్ చరిత్రను విద్యాసంస్థల్లో మరింత విస్తృతంగా బోధించాల్సిన అవసరం ఉంది. సరిహద్దుల్లో సైనికులు రాత్రింబవళ్లు అప్రమత్తంగా విధులు నిర్వహిస్తుండటంతోనే దేశ ప్రజలు ప్రశాంతంగా జీవించగలుగుతున్నారు. ప్రకృతి వైపరీత్యాలు వచ్చినా, ఉగ్రవాద ఘటనలు జరిగినా, అత్యవసర పరిస్థితులు ఎదురైనా ముందుండి సేవలందించే వారు మన సైనికులే. వారి సేవలను ఒక్కరోజు మాత్రమే గుర్తు చేసుకోవడం సరిపోదు. సమాజంగా వారిపట్ల గౌరవం, కృతజ్ఞతను ఎల్లప్పుడూ చూపించాలి. దేశ భద్రత విషయంలో అప్రమత్తతకు ప్రత్యామ్నాయం లేదు. ఆధునిక సాంకేతికత, బలమైన రక్షణ వ్యవస్థ, సమర్థవంతమైన గూఢచారి వ్యవస్థ, అత్యాధునిక ఆయుధాలు, సైనికులకు మెరుగైన శిక్షణ వంటి అంశాలు నిరంతరం బలోపేతం కావాలి. మారుతున్న అంతర్జాతీయ పరిస్థితుల్లో దేశ రక్షణను మరింత పటిష్ఠం చేయడం ప్రభుత్వాల ప్రాథమిక బాధ్యతగా ఉండాలి.

కార్గిల్ విజయం మనకు మరో ముఖ్యమైన సందేశాన్ని కూడా అందిస్తుంది. దేశ భద్రత అనేది కేవలం సైన్యం బాధ్యత మాత్రమే కాదు. ప్రతి పౌరుడు కూడా దేశ ప్రయోజనాలను కాపాడే బాధ్యతను గుర్తించాలి. జాతీయ ఐక్యతను బలోపేతం చేయడం, దేశ ప్రయోజనాలకు భంగం కలిగించే చర్యలను నిరోధించడం, చట్టాలను గౌరవించడం కూడా దేశ సేవలో భాగమే. ఈ సందర్భంగా కార్గిల్ అమరవీరుల కుటుంబాలను ఆదుకోవడం, మాజీ సైనికుల సంక్షేమానికి ప్రాధాన్యం ఇవ్వడం, సైన్యంలో చేరే యువతను ప్రోత్సహించడం వంటి చర్యలు మరింత విస్తృతంగా చేపట్టాలి. దేశం కోసం తమ జీవితాలను అంకితం చేసిన వారికి సమాజం అండగా నిలవడం నిజమైన నివాళి అవుతుంది.

కార్గిల్ విజయ్ దివస్ ప్రతి భారతీయుడిలో దేశభక్తిని, బాధ్యతను, జాతీయ గర్వాన్ని మళ్లీ మేల్కొలిపే రోజు. ఈ విజయం మనకు లభించిన స్వేచ్ఛ, భద్రత వెనుక ఎన్నో త్యాగాలు ఉన్నాయని గుర్తు చేస్తుంది. ఆ త్యాగాలను ఎప్పటికీ మరవకుండా, దేశ ఐక్యతను, సమగ్రతను కాపాడేందుకు ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతను నిర్వర్తించినప్పుడే కార్గిల్ అమరవీరులకు మనం అందించే నివాళి సార్థకమవుతుంది. చట్టాలను గౌరవించడం కూడా దేశ సేవలో భాగమే. ఈ సందర్భంగా కార్గిల్ అమరవీరుల కుటుంబాలను ఆదుకోవడం, మాజీ సైనికుల సంక్షేమానికి ప్రాధాన్యం ఇవ్వడం, సైన్యంలో చేరే యువతను ప్రోత్సహించడం వంటి చర్యలు మరింత విస్తృతంగా చేపట్టాలి. దేశం కోసం తమ జీవితాలను అంకితం చేసిన వారికి సమాజం అండగా నిలవడం నిజమైన నివాళి అవుతుంది. కార్గిల్ విజయ్ దివస్ ప్రతి భారతీయుడిలో దేశభక్తిని, బాధ్యతను, జాతీయ గర్వాన్ని మళ్లీ మేల్కొలిపే రోజు. ఈ విజయం మనకు లభించిన స్వేచ్ఛ, భద్రత వెనుక ఎన్నో త్యాగాలు ఉన్నాయని గుర్తు చేస్తుంది. ఆ త్యాగాలను ఎప్పటికీ మరవకుండా, దేశ ఐక్యతను, సమగ్రతను కాపాడేందుకు ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతను నిర్వర్తించినప్పుడే కార్గిల్ అమరవీరులకు మనం అందించే నివాళి సార్థకమవుతుంది.

# ఏఐ భద్రతపై కలకలం..

**శాన్‌ఫ్రాన్సిస్కో, జులై 25 (తెలంగాణ ముచ్చట్లు):** కృత్రిమ మేధ భద్రతపై ప్రపంచవ్యాప్తంగా చర్చకు దారితీసే ఘటన వెలుగులోకి వచ్చింది. పరీక్షల కోసం వినియోగిస్తున్న ఓ స్వయంచాలక కృత్రిమ మేధ ఏజెంట్ తనకు కేటాయించిన వ్యవస్థను దాటి ప్రముఖ కృత్రిమ మేధ వేదిక హగ్గింగ్ ఫేస్‌లోకి ప్రవేశించినట్లు అంతర్జాతీయ మీడియా కథనాలు వెల్లడించాయి. ఈ ఘటనను సంబంధిత సంస్థ వారం రోజుల తర్వాత గుర్తించినట్లు సమాచారం. కథనాల ప్రకారం, జులై 9న పరీక్షల సమయంలో ఆ కృత్రిమ మేధ ఏజెంట్ నియంత్రణ నుంచి బయటపడింది. అనంతరం జులై 11 నుంచి 13 వరకు హగ్గింగ్ ఫేస్ వ్యవస్థల్లో అనుమానాస్పద కార్యకలాపాలు జరిగినట్లు తెలుస్తోంది. ఈ సంఘటనకు కారణం తమ కృత్రిమ మేధ ఏజెంటేనని సంబంధిత సంస్థ జులై 20న గుర్తించినట్లు సమాచారం. అప్పటికే హగ్గింగ్ ఫేస్ ఈ విషయాన్ని అమెరికా దర్యాప్తు సంస్థ ఎఫ్‌బీఐ దృష్టికి తీసుకెళ్లినట్లు కథనాలు పేర్కొన్నాయి. ఈ ఘటనపై స్పందించిన సంబంధిత సంస్థ, కృత్రిమ మేధ భద్రత పరంగా ఇది అత్యంత కీలకమైన అంశమని తెలిపింది. స్వతంత్ర నిపుణులతో సమీక్ష చేపట్టామని, పూర్తి సాంకేతిక నివేదికను త్వరలో విడుదల చేస్తామని వెల్లడించింది. ఈ పరిణామం స్వయంచాలకంగా నిర్ణయాలు తీసుకునే కృత్రిమ మేధ వ్యవస్థల భద్రతపై కొత్త ప్రశ్నలను లేవనెత్తుతోంది. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కఠినమైన భద్రతా ప్రమాణాలు, నిరంతర పర్యవేక్షణ, సమగ్ర పరీక్షా విధానాలు అవసరమని సైబర్ భద్రత నిపుణులు సూచిస్తున్నారు.

తెలంగాణ ముచ్చట్లు TELANGANA MUCHATLU
ఎడిటర్: బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక



# బొద్దింకలు వ్యాఖ్యతో మొదలైన ఆవేదన..!

- కేంద్ర మంత్రి రాజీనామాతో ముగిసిన సిజేపీ తొలి దశ ఉద్యమం
- అభిజీత్ దీప్కే నేతృత్వంలోని కాక్రోచ్ జనతా పార్టీ ప్రస్థానం

హన్మకొండ,జులై25(తెలంగాణ ముచ్చట్లు):

ఒక వ్యాఖ్య.. లక్షలాది మంది యువతను కదిలించింది. ఒక నిరసన.. దేశవ్యాప్తంగా ఉద్యమంగా మారింది. చివరకు కేంద్ర ప్రభుత్వాన్ని చర్చల బల్లపైకి తీసుకొచ్చింది. ఇదే కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) ఆవిర్భావం నుంచి నీట్ ఉద్యమం వరకు జరిగిన పరిణామాల సారాంశం.

2026 మే నెలలో సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి సూర్యకాంత్, ఒక విచారణ సందర్భంగా నిరుద్యోగ యువతపై "కాక్రోచెస్", "ప్యారసైట్స్" అనే పదాలను ఉపయోగించడం దేశవ్యాప్తంగా తీవ్ర చర్చకు దారితీసింది. అనంతరం ఆ వ్యాఖ్యలు నకిలీ డిగ్రీలు కలిగిన వారి గురించి చేసినవేనని వివరణ ఇచ్చినప్పటికీ, అప్పటికే యువతలో తీవ్ర ఆవేదన వ్యక్తమైంది.

అదే సమయంలో అమెరికాలోని బోస్టన్ యూనివర్సిటీలో విద్యనభ్యసిస్తున్న అభిజీత్ దీప్కే ఆ వ్యాఖ్యలను తీవ్రంగా వ్యతిరేకించారు. యువత ఆత్మగౌరవాన్ని కాపాడాలనే లక్ష్యంతో 2026 మే 16న కాక్రోచ్ జనతా పార్టీ ను సాటైరికల్ ఉద్యమంగా ప్రారంభించారు. అవమానకరంగా వినిపించిన "కాక్రోచ్" అనే పదాన్నే ఉద్యమానికి గుర్తింపుగా మార్చడం ద్వారా యువత దృష్టిని ఆకర్షించారు.

తొలుత సామాజిక మాధ్యమాల్లో ప్రారంభమైన ఈ ఉద్యమం కొద్ది రోజుల్లోనే దేశవ్యాప్తంగా విస్తరించింది. నీట్ పేపర్ లీకేజీలు, పరీక్షల నిర్వహణలో అవకతవకలు, విద్యార్థుల ఆత్మహత్యలు, నిరుద్యోగం వంటి సమస్యలను ప్రధాన అంశాలుగా తీసుకుని విద్యార్థులను సంఘటితం చేశారు.

జూన్ 20 నుంచి ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద నిరవధిక ఆందోళనలు ప్రారంభమయ్యాయి. దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి విద్యార్థులు తరలివచ్చి ఉద్యమంలో పాల్గొన్నారు. కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని, విద్యార్థులపై నమోదైన కేసులను ఉపసంహరించాలని, బాధిత కుటుంబాలకు న్యాయం చేయాలని, విద్యా వ్యవస్థలో సమగ్ర సంస్కరణలు చేపట్టాలని సీజేపీ డిమాండ్ చేసింది.

36 రోజుల పాటు కొనసాగిన ఉద్యమం దేశవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. కేంద్ర ప్రభుత్వం సీజేపీ ప్రతినిధులతో పలు మార్లు చర్చలు జరిపింది. చివరకు జూలై 25న కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయగా, విద్యార్థులపై నమోదైన కేసుల ఉపసంహరణ, బాధిత కుటుంబాలకు పరిహారం వంటి అంశాలపై సూత్రప్రాయంగా అంగీకారం తెలిపినట్లు సీజేపీ ప్రకటించింది.

ఈ పరిణామాల అనంతరం అభిజీత్ దీప్కే ఉద్యమం తొలి దశ విజయవంతంగా ముగిసిందని ప్రకటించారు. "ఇది ఒక్క వ్యక్తి విజయం కాదు.. దేశ యువత విజయం. శాంతియుత ప్రజాస్వామ్య పోరాటం ద్వారా మార్పు సాధ్యమని మరోసారి నిరూపితమైంది" అని ఆయన పేర్కొన్నారు.ఒక వ్యాఖ్యపై యువత ఆవేదనతో మొదలైన ఈ ఉద్యమం, కొద్ది నెలల్లోనే జాతీయ స్థాయి చర్చకు దారితీసి కేంద్ర ప్రభుత్వాన్ని స్పందించేలా చేసిన పరిణామంగా నిలిచింది.



## కీలకంగా మారిన సోనం వాంగ్‌చుక్ మద్దతు

నీట్ పేపర్ లీకేజీకి వ్యతిరేకంగా సాగిన ఉద్యమానికి ప్రముఖ విద్యావేత్త, పర్యావరణ కార్యకర్త సోనం వాంగ్‌చుక్ మద్దతు తెలపడం కీలక మలుపుగా మారింది. ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద విద్యార్థులకు సంఘీభావంగా ఆయన నిరవధిక నిరాహార దీక్ష చేపట్టారు. నీట్ పరీక్షల్లో జరిగిన అవకతవకలపై స్వతంత్ర దర్యాప్తు చేపట్టాలని, విద్యార్థులకు న్యాయం చేయాలని, విద్యా వ్యవస్థలో సమగ్ర సంస్కరణలు తీసుకురావాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వాంగ్‌చుక్ మద్దతుతో ఉద్యమం జాతీయ స్థాయిలో మరింత ప్రాధాన్యం సంతరించుకోగా, పలువురు మేధావులు, సామాజిక కార్యకర్తలు, యువజన సంఘాలు కూడా సంఘీభావం ప్రకటించాయి.

అయితే దీక్ష కొనసాగుతున్న సమయంలో సోనం వాంగ్‌చుక్ ఆరోగ్యం క్షీణించడంతో ఆయనను ఆస్పత్రికి తరలించారు. ఉద్యమం ఆగిపోకుండా కొనసాగించేందుకు సీజేపీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే నిరవధిక నిరాహార దీక్ష చేపట్టారు. అనంతరం ఆస్పత్రి నుంచి సందేశం పంపిన సోనం వాంగ్‌చుక్, ఉద్యమం కొనసాగడం ఎంత ముఖ్యమో, ఉద్యమానికి నాయకత్వం వహిస్తున్న వారి ఆరోగ్యం కూడా అంతే ముఖ్యమని పేర్కొంటూ దీప్కే దీక్ష విరమించాలని కోరారు. ఆయన విజ్ఞప్తిని గౌరవించిన అభిజీత్ దీప్కే నిరాహార దీక్షను విరమించి ఉద్యమానికి నాయకత్వం కొనసాగించారు. ఈ పరిణామం ఉద్యమానికి మరింత ప్రజాదరణను తీసుకురావడంతో పాటు, దేశవ్యాప్తంగా విశేష మద్దతు కూడగట్టడంలో కీలక పాత్ర పోషించింది.

# ఆగస్టు 15లోపు లక్ష ఇంకుడు గుంతలు

- లక్ష్య సాధనపై సీతక్క ఆదేశాలు
- జలసిరి పనుల్లో వేగం పెంచాలి
- గ్రామసభలతో అభివృద్ధికి ప్రాధాన్యం

హైదరాబాద్, జూలై 25 (తెలంగాణ ముచ్చట్లు):



రాష్ట్రవ్యాప్తంగా ఆగస్టు 15వ తేదీలోపు లక్ష ఇంకుడు గుంతల నిర్మాణాన్ని పూర్తి చేయాలని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క అధికారులను ఆదేశించారు. ఈ లక్ష్యాన్ని అత్యుత్తమంగా సాధించిన అధికారులు, గ్రామ పంచాయతీలు, ప్రజాప్రతినిధులను ముఖ్యమంత్రి చేతుల మీదుగా సన్మానిస్తామని ప్రకటించారు. జల సంరక్షణ, భూగర్భ జలాల పెంపు కోసం చేపట్టిన ఈ కార్యక్రమాన్ని అత్యంత ప్రాధాన్యంగా పూర్తి చేయాలని సూచించారు. ఆగస్టు 7వ తేదీ నుంచి జిల్లాల వారీగా స్వయంగా సమీక్షా సమావేశాలు నిర్వహిస్తానని మంత్రి తెలిపారు. ప్రతి జిల్లాలో పనుల పురోగతిని క్షేత్రస్థాయిలో పరిశీలించి నిర్దేశించిన లక్ష్యాలను సాధించేలా అధికారులు బాధ్యతాయుతంగా పనిచేయాలని ఆదేశించారు. పనుల్లో అలసత్వం ప్రదర్శించకుండా నిరంతర పర్యవేక్షణ కొనసాగించాలని స్పష్టం చేశారు.

ప్రతి సోమవారం, మంగళవారం, బుధవారం గ్రామసభలను తప్పనిసరిగా నిర్వహించి వీబీ జీ రాంజీ పరిధిలోని 318 రకాల పనులను గ్రామాల అవసరాలకు అనుగుణంగా గుర్తించి వెంటనే ప్రారంభించాలని మంత్రి ఆదేశించారు. గ్రామసభల ద్వారా ప్రజల భాగస్వామ్యాన్ని పెంచి గ్రామాభివృద్ధి కార్యక్రమాలను వేగవంతం చేయాలని సూచించారు. తెలంగాణ జలసిరి కార్యక్రమాన్ని యుద్ధప్రాతిపదికన అమలు చేయాలని, ప్రతి ఇంటికి ఇంకుడు గుంత, ప్రతి పంటకు పంటకుంట, ప్రతి గ్రామానికి ఊటకుంట, బోర్‌వెల్ రీచార్జ్ వంటి నీటి సంరక్షణ పనులను వేగంగా పూర్తి చేయాలని మంత్రి పేర్కొన్నారు. మండల స్థాయిలో పనుల పురోగతిని పర్యవేక్షించేందుకు మిషన్ భగీరథ సహాయ ఇంజినీర్, పంచాయతీరాజ్ సహాయ ఇంజినీర్, మండల అభివృద్ధి అధికారి, అదనపు కార్యక్రమ అధికారి, మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలితో ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేయాలని ఆదేశించారు.



# మర్రిగూడ ఫ్లైఓవర్ ప్రారంభం

- నల్లగొండలో ట్రాఫిక్ సమస్యలకు శాశ్వత పరిష్కారం
- మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి చేతుల మీదుగా ప్రారంభం
- రవాణా, వాణిజ్యాభివృద్ధికి కొత్త ఊతం

నల్లగొండ, జూలై 25 (తెలంగాణ ముచ్చట్లు):



నల్లగొండ పట్టణ అభివృద్ధిలో మరో కీలక ఘట్టంగా నార్కట్‌పల్లి-అద్దంకి-మేదరమెట్ల జాతీయ రహదారిపై మర్రిగూడ జంక్షన్ వద్ద నూతనంగా నిర్మించిన ఫ్లైఓవర్‌ను రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రజాప్రతినిధులు, అధికారులు, స్థానికులు పాల్గొన్నారు. ఫ్లైఓవర్ అందుబాటులోకి రావడంతో నల్లగొండ పట్టణ వాసులతో పాటు ఈ మార్గంలో నిత్యం ప్రయాణించే వేలాది మంది వాహనదారులకు ట్రాఫిక్ రద్దీ నుంచి గణనీయమైన ఉపశమనం లభించనుంది. అత్యంత రద్దీగా ఉండే మర్రిగూడ జంక్షన్‌లో ప్రయాణ సమయం తగ్గడంతో పాటు రవాణా మరింత సులభతరం కానుంది. రోడ్డు ప్రమాదాలను తగ్గించి ప్రజలకు సురక్షితమైన, వేగవంతమైన ప్రయాణాన్ని అందించాలనే లక్ష్యంతో ఈ ఫ్లైఓవర్‌ను నిర్మించినట్లు అధికారులు తెలిపారు. పెరుగుతున్న వాహనాల రాకపోకలకు అనుగుణంగా ఆధునిక మౌలిక వసతులను కల్పించడంలో ఈ ప్రాజెక్టు కీలకంగా నిలుస్తుందని పేర్కొన్నారు. మౌలిక సదుపాయాల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి తెలిపారు. రహదారి వ్యవస్థను మరింత బలోపేతం చేయడం ద్వారా ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు.

ఈ ఫ్లైఓవర్ వల్ల నల్లగొండ ప్రాంత ఆర్థిక, వాణిజ్య కార్యకలాపాలకు మరింత ఊతం లభించనుందని అధికారులు అభిప్రాయపడ్డారు. రవాణా వ్యవస్థ మెరుగుపడటంతో వ్యాపార కార్యకలాపాలు వేగవంతమయ్యే అవకాశాలు ఉన్నాయని తెలిపారు. ఫ్లైఓవర్ ప్రారంభంతో ప్రాంతీయ ప్రజలు, వాహనదారులు హర్షం వ్యక్తం చేశారు. భవిష్యత్తులో కూడా ఇలాంటి అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టి నల్లగొండను మరింత అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లాలని వారు ప్రభుత్వాన్ని కోరారు.



# ఇందిరమ్మ టవర్స్‌పై సందేహాల నివృత్తికి హెల్ప్‌లైన్ ప్రారంభం

- 040-24603572 నంబర్‌కు ఫోన్ చేసి పూర్తి వివరాలు తెలుసుకోవచ్చని మంత్రి పొంగులేటి వెల్లడి
- దరఖాస్తుకు ఆధార్ ఒక్కటే సరిపోతుందని స్పష్టీకరణ
- యూపీఐ లేదా నెట్ బ్యాంకింగ్ ద్వారానే రూ.10 వేల ఈఎండీ చెల్లించాలని సూచన

హైదరాబాద్, జూలై 25 (తెలంగాణ ముచ్చట్లు): హైదరాబాద్ మహానగరంలోని పేద, దిగువ మధ్యతరగతి కుటుంబాలకు గౌరవప్రదమైన సొంతింటిని అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం చేపట్టిన ఇందిరమ్మ టవర్స్ పథకంపై ప్రజల్లో ఎలాంటి అపోహలు, సందేహాలు లేకుండా ప్రత్యేక కాల్ సెంటర్ హెల్ప్‌లైన్‌ను రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార-పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి శనివారం ప్రారంభించారు. హౌసింగ్ బోర్డు కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఈ హెల్ప్‌లైన్ ద్వారా పథకానికి సంబంధించిన పూర్తి సమాచారాన్ని ప్రజలకు అందించనున్నట్లు తెలిపారు. ఇందిరమ్మ టవర్స్‌కు సంబంధించిన దరఖాస్తు విధానం, అర్హతలు, చెల్లింపులు, కేటాయింపు విధానం తదితర వివరాల కోసం ప్రజలు ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 6 గంటల మధ్య 040 24603572 నంబర్‌కు నేరుగా ఫోన్ చేసి అధికారిక సమాచారం తెలుసుకోవాలని మంత్రి సూచించారు. మధ్యవర్తులను నమ్మి మోసపోవద్దని, తెలుగు, హిందీ, ఆంగ్లం, ఉర్దూ భాషల్లో సమాచారం అందుబాటులో ఉంటుందని వెల్లడించారు.

క్యూర్ పరిధిలో లక్ష ఇళ్ల నిర్మాణమే ప్రభుత్వ లక్ష్యమని, తొలి విడతలో 16 నియోజకవర్గాల్లో 7,680 ఇళ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టినట్లు మంత్రి తెలిపారు. దరఖాస్తుదారులు తాము నివసిస్తున్న నియోజకవర్గంలోనే దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. మీ సేవ కేంద్రాలు, ఆన్‌లైన్ పోర్టల్, వాట్సాప్ ద్వారా దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించినట్లు పేర్కొన్నారు. హైదరాబాద్ క్యూర్ పరిధిలో పదేళ్లుగా నివసిస్తున్న, వార్షిక కుటుంబ ఆదాయం రూ.6 లక్షల వరకు ఉన్న కుటుంబాలు ఈ పథకానికి అర్హులని మంత్రి వివరించారు. ఒక కుటుంబం నుంచి ఒకే దరఖాస్తును స్వీకరిస్తామని, అర్హత సాధించిన కుటుంబానికి ఒక ఫ్లాట్ మాత్రమే కేటాయిస్తామని చెప్పారు. దరఖాస్తుదారు లేదా కుటుంబ సభ్యుల పేరుపై ఓఆర్ఆర్, క్యూర్ పరిధిలో ఇల్లు, ఫ్లాట్ లేదా స్థలం ఉండకూడదని స్పష్టం చేశారు.

దరఖాస్తు సమయంలో ఆధార్ నంబర్ మాత్రమే నమోదు చేస్తే సరిపోతుందని, కులం, ఆదాయం తదితర ధ్రువీకరణ పత్రాలను అప్‌లోడ్ చేయాల్సిన అవసరం లేదని మంత్రి తెలిపారు. అర్హత నిర్ధారణ, లాటరీ ప్రక్రియ సమయంలో అవసరమైన పత్రాలను సమర్పించవచ్చని చెప్పారు. దరఖాస్తు సమయంలో రూ.10 వేల ఈఎండీని యూపీఐ లేదా నెట్ బ్యాంకింగ్ ద్వారానే చెల్లించాలని, ఫ్లాట్ రాకపోతే అదే బ్యాంకు ఖాతాకు మొత్తం తిరిగి జమ అవుతుందని స్పష్టం చేశారు. ఈ పథకం కింద 525 చదరపు అడుగుల విస్తీర్ణంలో ఒక పడక గది, హాలు, వంటగదితో కూడిన ఫ్లాట్లను నిర్మిస్తున్నట్లు మంత్రి తెలిపారు. ఒక్కో ఫ్లాట్ విలువ రూ.40 లక్షల నుంచి రూ.60 లక్షల వరకు ఉంటుందని, ప్రభుత్వం రూ.5 లక్షల సబ్సిడీతో పాటు 20 నుంచి 25 గజాల అవిభాజ్య స్థల హక్కును లబ్ధిదారుడి పేరుతో నమోదు చేస్తుందని చెప్పారు. లబ్ధిదారుడు కేవలం రూ.6 లక్షలు మాత్రమే చెల్లించాల్సి ఉంటుందని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో గృహ నిర్మాణ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వి.పి. గౌతమ్, హౌసింగ్ బోర్డు ప్రధాన కార్యనిర్వహణాధికారి రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

Printed,Published and Owned by RAJESH BOLLEPAKA,Printed at Amulya Publications and Printers Graphics,H.No:2-19/1,Thatikayala,Dharmasagar,Hanmakonda,506151 and Published at H.No:2-19/1,Thatikayala,Dharmasagar,Hanmakonda,506151.Editor:BOLLEPAKA RAJESH.RNI:TELTEL/2023/88710.Contact:9493669669.Email:telanganamuchatlu.in@gmail.com.Website:www.telanganamuchatlu.in